



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 291 | శుక్రవారం 08 మే 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# గవర్నర్ ససేమిరా

- విజయ్‌కు మళ్లీ తిరస్కరణ న్యాయ నిపుణులతో సమావేశమైన టివికె అధినేత
- ఆర్లేకర్ తీరుపై పెరుగుతున్న వ్యతిరేకత
- నిరసనలకు కాంగ్రెస్ పిలుపు
- మేం అడ్డు రాం : స్టాలిన్ ప్రకటన
- మిత్రపక్షాలతో భేటీ
- నేడు వామపక్షాల సమావేశం
- అసమ్మతి ఎంఎల్‌ఏలను బుజ్జగించే యత్నంలో ఎఐఎడిఎంకె



చెన్నై- సూర్య వాస్తవం

తమిళనాడులో టివికె అధినేత విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు ఆ రాష్ట్ర ఇన్‌ఛార్జి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ అడ్డంకిగా మారారు. శాసనసభలో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన టివికె ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకొచ్చినప్పటికీ గవర్నర్ ససేమిరా అంటున్నారు. గురువారం నాడు కూడా ఆయన తీరులో మార్పు రాకపోవడం టివికె శ్రేణుల్లో ఆగ్రహం కలిగిస్తోంది. సామాన్య ప్రజల్లోనూ ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఆర్ఎస్ఎస్ నేపథ్యమున్న ఆర్లేకర్ ఉద్దేశ్యపూర్వకంగానే - మిగతా 2లో..



## భారత్ లో పర్యటించనున్న మార్కో రూబియో

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఈ నెలాఖరున అమెరికా విదేశాంగ మం త్రి మార్కో రూబియో భారత్ లో పర్యటించనున్నారు. క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడానికి రూబియో వస్తున్నారు. భారత్ తో ద్వైపాక్షిక చర్చల్లోనూ ఆయన పాల్గొననున్నారు. ఈ విషయాన్ని భారత్ లోని రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. గత జనవరిలో అమెరికా విదేశాంగ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రూబియో తొలిసారిగా మే 24 నుంచి 26 వరకు మూడు రోజుల పర్యటన నిమిత్తం - మిగతా 2లో..



## మరింత బలంగా తిరిగొస్తాం!

- ప్రజా విశ్వాసాన్ని చూరగొంటాం
- ఈ తీర్పు అంతిమం కాదు !

పినరయి విజయన్ 2లో



## టీవీకే రానివ్వండి : - ఎంకే స్టాలిన్

2లో




## ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో రూ.1,445 కోట్లు స్వాధీనం

2లో

- గత ఎన్నికలతో పోలిస్తే పెరిగిన 40.14 శాతం రికవరీ
- వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

# ప్రజల సంతృప్తే కీలకం

- ఆ దిశగా పాలన అందించాలి
- అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టాలి
- అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




అమరావతి - సూర్య వాస్తవం

ప్రజల సంతృప్తే కొలమానం దిశగా పాలన అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశించారు. సచివాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల సదస్సులో భాగంగా తొలిరోజైన గురువవారం ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో అన్ని వ్యవస్థల్లో రాష్ట్రం పనితీరు బెంచ్ మార్క్ గా మారాలని కోరారు. - మిగతా 3లో..




## బీహార్ మంత్రివర్గ విస్తరణ

- నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్‌తో సహా 32 మంది మంత్రులు ప్రమాణస్వీకారం

పాట్నా - సూర్య వాస్తవం

బీహార్ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో కొత్తగా జరిగిన మంత్రివర్గంలోకి ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ చోటు దక్కించుకున్నారు. నిశాంత్‌తోపాటు 32 మంది - మిగతా 2లో..

## తెలుగు రాష్ట్రాల్లో తమిళ పాలిటిక్స్ హీట్

## మారిపోతున్న ఎన(ర్న) లిస్టులు

2లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి




## మే 12న కొలువుదీరనున్న అస్సాం కొత్త ప్రభుత్వం

గౌహతి - సూర్య వాస్తవం

అస్సాంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ ఘన విజయం సాధించింది. దీంతో అక్కడ వరుసగా మూడోసారి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రానుంది. మే 12న బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొలువుదీరనుందని అస్సాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కోటా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీతోపాటు, పలువురు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత ముఖ్యమంత్రలు, డిప్యూటీ సిఎంలు హాజరుకానున్నారు. గౌహతిలోని ఖానాపారాలోని వెటర్నరీ ఫీల్డ్ (ప్రతిష్టాత్మక వ్యవసాయ విశ్వవిద్యాలయం)లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుందని ఆయన తెలిపారు. కాగా, సిఎంగా మూడోసారి హిమంతబిశ్వ శర్మ ప్రయాణస్వీకారం చేయను న్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్రం నుంచి పరిశీలకుడిగా జెపి నడ్డాను బిజెపి అధిష్టానం నియమించింది. ఇప్పటికే హిమంతబిశ్వశర్మ తన సిఎం పదవికి రాజీనామా చేశారు.

# ఇక విద్యా శాఖ మొత్తానికీ ఒకే డ్యాష్‌బోర్డు

- మంత్రి నారా లోకేష్.కీలక ప్రకటన
- పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యను ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నం
- హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వివరాలు డ్యాష్‌బోర్డులో అందుబాటు
- త్వరలో ప్రజలకు సైతం ఈ డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తెస్తామని స్పష్టీకరణ
- ఉత్తమ విధానాలకు కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామన్న సీఎం చంద్రబాబు



అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్ర విద్యాశాఖ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ, ఒకే డ్యాష్‌బోర్డును రూపొందించబోతున్నట్టు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని విభాగాల పనితీరును దీని ద్వారా పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. అమరావతి సచివాలయంలో జరుగుతున్న 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "విద్యాశాఖకు సంబంధించి ఒక సమగ్రమైన కేపీఐ (కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్) డ్యాష్‌బోర్డును రూపొందించాం. విద్యార్థుల హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వంటి కీలక అంశాలను ఇందులో పొందుపరిచాం. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో ఈ డ్యాష్‌బోర్డు కలెక్టర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు. 'డెమాక్రటైజేషన్ ఆఫ్ డేటా' తమ లక్ష్యమని, త్వరలోనే ఈ డ్యాష్‌బోర్డును ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేసేందుకు జిల్లాల కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా, స్కూళ్లలో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు మెంటార్‌గా కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

## భారత్ లో పర్యటించనున్న
# మార్కో రూబియో

(మొదటి పేజీ తరువాయి)

భారత్ కు రానున్నారని గోర్ తెలిపారు. అలాగే, రాబోయే నెలల్లో పలువురు అమెరికా గవర్నర్లు భారత్ లో పర్యటించనున్నారని గోర్ ప్రకటించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధుతో సమావేశమైన తరువాత గోర్ ఈ వివరాలను సోషల్ మీడియాలో గురువారం వెల్లడించారు. ఈ నెల 26న జరిగే క్వాడ్ విదేశాంగ మం త్రుల సమావేశంలో జైశంకర్, రూబియోలతో పాటు పెన్నీ వాంగ్ (ఆస్ట్రేలియా), తోషిమిత్సు మొటెగి (జపాన్) పాల్గొంటారు. తరువాత జైశంకర్, అజిత్ దోవల్‌లతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో కూడా రూబియో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొంటారు. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పురోగతిని కూడా రూబియో సమీక్షించే అవకాశం ఉంది.

# బీహార్ మంత్రివర్గ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం పాట్నాలో గాంధీ మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా, రక్షణ శాఖా మంత్రి రాజనాథ్ సింగ్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జెడియు అధ్యక్షులు నితీష్‌కుమార్‌తోపాటు పలువురు ఎన్‌డిఎ నేతలు పాల్గొన్నారు. కాగా, కొత్తగా ఏర్పడిన మంత్రివర్గంలో ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరితో సహా బిజెపికి 15 మంత్రి పదవులు, ఇక మిత్రపక్ష పార్టీ జెడియుకి 13 (ఇద్దరు డిప్యూటీ సిఎంలు : బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరి), లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) : ఇద్దరు, హిందుస్తానీ ఆవామ్ మోర్చా (సెక్యులర్) : ఒకరు, రాష్ట్రీయ లోక్ మోర్చా నుండి ఒకరు మంత్రులుగా గురువారం ప్రమాణం చేశారు. మంత్రివర్గంలో ఓబిసి, ఇబిసి, హిందువులు, దళితులు, మహిళలు ఇలా వివిధ సామాజిక వర్గాలకు చెందినవారికి కేబినెట్‌లో స్థానం కల్పించారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ముఖ్యమంత్రి, ఇద్దరు ఉపముఖ్యమంత్రులతో 35 మందితో కూడిన మంత్రివర్గం ఉంది. 243 అసెంబ్లీ స్థానాలున్న అసెంబ్లీకి గరిష్టంగా 36 మంది మంత్రులు ఉండవచ్చు. తాజాగా ఏర్పడిన కొత్త కేబినెట్‌లోకి మాజీ సిఎం నితీష్‌కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ (జెడియు, శ్వేతా గుప్తా (జెడియు) మిథిలేష్ తివారి (బిజెపి), శైలేష్ కుమార్ (జెడియు)లతో పాటు పలువురు కొత్త కేబినెట్‌లో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

# ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో
# రూ.1,445 కోట్లు స్వాధీనం

### - గత ఎన్నికలతో పోలిస్తే పెరిగిన 40.14 శాతం రికవరీ
### వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులను భారీ ఎత్తున సీజ్ చేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం(ఇసిఐ) వెల్లడించింది. ఈ మొత్తం విలువ రూ.1,444.96 కోట్లకు పైగా ఉంటుందని తెలిపింది. ఇందులో నగదు రూ.154.89 కోట్లు, మద్యం విలువ రూ.183.33 కోట్లు (69,88,793.38 లీటర్లు), డ్రగ్స్ రూ.337.88 కోట్లు, విలువైన లోహాలు రూ.250.14 కోట్లు, ఉచితాలు తదితరాల విలువ రూ.518.73 కోట్లని ఇసిఐ వివరించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించింది. ఎన్నికల అక్రమాలను అరికట్టేందుకు 'ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఇఎస్‌ఎంఎస్) అనే ఐటి ప్లాట్‌ఫామ్ ను వినియోగిం చినట్లు తెలిపింది. దీని ద్వారా వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం మెరుగుపడి సమాచార మార్పిడి వేగవంతమైందని వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 26న ఇఎస్‌ఎంఎస్ యాక్టివేట్ చేసినప్పటి నుంచి మే 6 వరకు పట్టుబడిన మొత్తం సొత్తు వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికలు జరిగిన అన్ని ప్రాంతల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) పటిష్టంగా అమలు చేసినట్లు తెలిపింది. అయితే బెంగాల్ లోని ఫాల్టా (144) అసెంబ్లీ నియోజకవర్గం మినహా మిగిలిన అన్ని చోట్లా మోడల్ కోడ్ ముగిసినట్లు పేర్కొంది.

**తమిళనాడులోనే అత్యధికం..**

ఈ ఐదు రాష్ట్రాల్లో గత ఎన్నికల్లో పట్టుబడిన సొత్తు తో పోల్చితే తాజా ఎన్నికల్లో స్వాధీనం చేసుకొన్న సొమ్ము ఏకంగా 40.14 శాతం పెరిగింది. 2021 సాధారణ ఎన్నికల్లో రూ.1029.93 కోట్లు రికవరీ చేసినట్లు ఇసిఐ వెల్లడించిం ది. కాగా ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఉద్దేశించన డబ్బులో ఎక్కువ భాగం తమిళనాడులోనే స్వాధీనం చేసుకోవడం గమనార్హం. తమిళనాడులో అత్యధికంగా రూ.662.28 కోట్లు సీజ్ చేయగా పశ్చిమ బెంగాల్ రూ.573.41 కోట్లతో రెండో స్థానంలో ఉంది. అస్సాంలో రూ.117.24 కోట్లు, కేరళలో రూ.80.67 కోట్లు, పుదుచ్చేరిలో రూ.9.72 కోట్లు పట్టుబడినట్లు ఇసి వెల్లడించింది.

# గవర్నర్ ససేమిరా

(మొదటి పేజీ తరువాయి)

ఇలా వ్యవహరిస్తున్నారని, మోడీ, అమిత్‌షాల నుండి వచ్చిన ఆదేశాలను పాటిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమల్‌హాసన్, ప్రకాశ్ రాజ్‌లతో పాటు పలువురు సినీ నటులు గవర్నర్ తీరు విమర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. డిఎంకె అధినేత స్టాలిన్ కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన విజయ్‌ను ఎటువంటి పరిస్థితుల్లోనూ తాము అడ్డుకోబోమని, బాధ్యతా యుతమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని ఆయన ప్రకటించారు. సిపిఎం, సిపిఐ, విసికె పార్టీల నేతలతో కూడా ఆయన సమావేశమ య్యారు. టివికె నాయకులు కూడా సిపిఎం, సిపిఐ నేతలను కలిసి తాజా పరిణామలపై చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటులో విజయ్‌కు మద్దతు ఇవ్వాలని వారు కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమితో ఎటువంటి చర్చలు జరపడం ??లేదని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు నేడు (శుక్రవారం) విడివిడిగా సమావేశం కానున్నాయి. ఇదిలావుండగా గవర్నర్ వైఖరికి నిరసనగా శుక్రవారం నాడు ఆందోళనలకు, లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. మరోవైపు అసమ్మతి ఎంఎల్‌ఏలను బుజ్జగించే పనిలో ఎఐడిఎంకె నిమగ్నమైంది. పుదుచ్చేరిలో ఎంఎల్‌ఏలతో క్యాంపు నిర్వహిస్తున్న ఆ పార్టీ వారిని గురువారం నాడు మరో హోటల్‌కు తరలించింది. ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేస్తారు...? విజయ్‌కు గవర్నర్ ప్రశ్న 113 మంది ఎంఎల్‌ఏల మద్దతు ఉన్నట్లు బుధవారం ఇచ్చిన లేఖపై గవర్నర్ పలు సందేహాలను, అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో టివికె అధినేత విజయ్ గురువారం ఉదయం మరోసారి లోక్‌భవన్‌లో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా టివికె 108 స్థానాల్లోనే గెలిచిన విషయాన్ని ప్రస్తావించిన గవర్నర్ 113 మంది పేర్లతో లేఖ ఇవ్వడాన్ని ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించిన విషయాన్ని విజయ్ ఆయనకు వివరించారు. ఆ పార్టీ ఇచ్చిన లేఖతో పాటు 113 మంది సంతకాలు ఉన్న మరో లేఖను కూడా గవర్నర్‌కు అందచేశారు. శాసనసభలో అతిపెద్ద పార్టీగా ఉన్న తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని మరోసారి కోరారు. ప్రభుత్వం ఏర్పాటైన రెండు వారాల్లో శాసనసభ వేదికగా బలాన్ని నిరూపించుకుంటానని చెప్పారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. న్యాయనిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని గవర్నర్ విజయ్‌కు చెప్పారు. దీంతో గవర్నర్ సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న ప్రచారం జరిగింది. గురువారం సాయంత్రమే విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారంటూ వార్తలు వచ్చాయి. అయితే, ఆ తరువాత కాసేపటికే పరిస్థితి మారింది. విజయ్ సమర్పించిన సంఖ్యాబలం పట్ల గవర్నర్ సంతృప్తిగా లేరంటూ లోక్‌భవన్ నుండి టివికె కార్యాలయానికి ఫోన్ వచ్చింది.

పూర్తి మెజార్టీ లేకుండా ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ఆయన ప్రశ్నించారని 118 మంది ఎంఎల్‌ఏల మద్దతు సమకూర్చుకున్నాకే సిఎంగా ప్రమాణం చేయలని ఆ ఫోన్‌కాల్ ద్వారా టివికె నేతలకు లోక్‌భవన్ వర్గాలు సూచించాయి. దీంతో ప్రమాణ స్వీకారం గురువారం నాడే ఉంటుందన్న భావించి పెద్ద సంఖ్యలో చెన్నైకు చేరుకున్న విజయ్ అభిమానుల్లో తీవ్ర నిరాశ, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. న్యాయ నిపుణులతో విజయ్ భేటీ గవర్నర్ నుండి పదేపదే తిరస్కరణ ఎదురవుతున్న నేపథ్యంలో టివికె అధినేత విజయ్ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. మద్దతు కోసం వివిధ పార్టీలతో చర్చలు జరుపుతూనే, న్యాయపోరాటం చేసే అంశాన్ని కూడా ఆయన పరిశీలిస్తున్నారు. న్యాయ నిపుణులతో గురువారం సాయంత్రం ఆయన సమావేశమైనారు. దాదాపు మూడు గంటల పాటు ఈ సమావేశం జరిగింది.

వివిధ రాష్ట్రాలలో గతంలో చోటుచేసుకున్న సంఘటనలు, సుప్రీంకోర్టు తీర్పులు వంటి అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. విధులను సరిగా నిర్వహించండి : కమల్ ట్వీట్ 'రాజ్యాంగ బద్ద హోదాలో ఉన్నవాళ్లు విధులు సరిగా నిర్వహించాలి' అని ప్రముఖ సినీ నటుడు.మక్కల్ నీది మయ్యం అధినేత, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన చేసిన పోస్ట్‌లో తమిళనాడు గవర్నర్ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నరని, ప్రజల ఆకాంక్షలను అవమానపరుస్తున్నారని పేర్కొన్నారు. బలనిరూపణ జరగాల్సింది అసెంబ్లీలోనని, లోక్‌భవన్‌లో కాదన్న ఆయన విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని సూచించారు. మరో సినీనటుడు ప్రకాశ్ రాజ్ చేసిన పోస్టులో 'ప్రజలు విజయ్‌కు పట్టం కట్టారు.. శాసనసభలో బలనిరూపణకు అవకాశం ఇవ్వాల్సిందే' అని పేర్కొన్నారు. ఎఐఎడిఎంకె తిప్పలు... అసమ్మతి ఎంఎల్‌ఏలను బుజ్జగించడానికి ఎఐఎడిఎంకె నేతలు తిప్పలు పడుతున్నారు. పుదుచ్చేరి క్యాంపులో ఉన్న వారిని మూడో హోటల్‌కు గురువారం మార్చారు. పూరంకుప్పం రిసార్టులోని 'సీ వ్యూ' గదులకు వారిని తాజాగా మార్చినట్లు వార్తలు వచ్చాయి. వీరిలో దాదాపు 28 మంది అసమ్మతి నేత షణ్ముగం అనుయాయులు కావడం గమనార్హం. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి పళనిస్వామికి గవర్నర్‌తో అప్పాయింట్ మెంట్ ఉన్నప్పటికీ, ఆయన దానిని రద్దు చేసుకుని ఎంఎల్‌ఏలతో మాట్లాడటానికి పుదుచ్చేరి వెళ్లారు. రిసార్టుల్లో ఉన్న ఎంఎల్‌ఏల గురించి ఎఐఎడిఎంకె నేతలను మీడియా ప్రతినిధులు ప్రశ్నిస్తే 'చెన్నైలో వేడి తట్టుకోలేక చల్లటి గాలికోసం రిసార్టుల కెళ్లారు. అంతే తప్ప మరేమి లేదు' అని చెబుతుండటం ఆసక్తి కరంగా మారింది.

# మరింత బలంగా తిరిగొస్తాం!

**తిరువనంతపురం- సూర్య వాస్తవం**

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్)కు, ఈ తీర్పు అంతిమం కాదని, అయితే నిరంతర రాజకీయ కార్యకలాపాలకు ఇదొక కొత్త ఆరంభమని మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన తొలి సారిగా స్పందించారు. మరింత బలంగా తిరిగి వస్తామని, కేరళం ప్రజల విశ్వా సాన్ని తిరిగి చూరగొంటామని మేం హామీనిస్తున్నా మంటూ ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**యుడిఎఫ్‌కు అభినందనలు...**

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును మేం గౌరవంగా అంగీకరిస్తున్నాం. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన యుడిఎఫ్‌కు మా అభినందనలు తెలియచేస్తున్నాం. ఎల్‌డిఎఫ్‌కు సంబంధించినంతవరకు, ఎన్నికల ఫలితాలు మొత్తంగా ఊహించనివి. అన్ని రకాలుగా ప్రతికూల ప్రచారం, దాడులు జరిగినప్పటికీ, ఎల్‌డిఎఫ్‌కు ప్రజలు అందించిన తోడ్పాటు, మద్దతుకు మేం ప్రజలకు కృతజ్ఞతలు చెబుతున్నాం. మేం ఆశించిన వరుసగా మూడోసారి విజయం చేజారినప్పటికీ, పెద్ద సంఖ్యలో ప్రజలు ఎల్‌డిఎఫ్‌వైపు దృఢంగా నిలుచున్నారన్న వాస్తవం మాకు అత్యధికంగా విశ్వాసాన్ని కలగచేస్తోంది.

ప్రజా విశ్వాసాన్ని మరింత బలంగా తిరిగి పొందడానికి, మరింత బలమైన శక్తి సామర్ధ్యాలతో ముందుకు సాగేందుకు మేం కట్టుబడి వున్నాం. గత పదేళ్ళలో అమలు చేసిన అభివృద్ధి చొరవలు, సంక్షేమ పథకాలు సమాజంలో ప్రధాన మార్పులు తీసుకువచ్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇవి అర్ధంతరంగా నిలిచిపోకుండా, ముందుకు తీసుకెళ్ళడానికి గానూ బలమైన ప్రజా చైతన్యం కొనసాగాలి. కొత్త కేరళంను నిర్మించేందుకు ఎల్‌డిఎఫ్ ముందుకు తీసుకువచ్చిన దార్శనికతలు-విజ్ఞాన ఆర్థిక వ్యవస్థ, యువత ఉపాధి, సామాజిక న్యాయం, ప్రజారోగ్యం, విద్య-బలమైన ప్రతిపక్ష పాత్ర ద్వారా ముందుకు తీసుకెళ్ళబడతాయి. తీవ్ర పేదరికాన్ని నిర్మూలించడం, మహిళా సాధికారత, సామాజిక భద్రత వంటి రంగాల్లో మన విధానాలు ప్రజలకు అవసరం. వీటిని అమలు చేయడానికి కొత్త ప్రభుత్వంపై మేం ప్రజాతంత్ర పద్ధతిలో ఒత్తిడి తీసుకువస్తాం.

**మతోన్మాదం ఏ రూపంలో దానిపై రాజీలేని పోరాటం..**

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచ డానికి తీసుకునే ఏ మంచి చర్యలకైనా మేం మద్దతునిస్తాం. అదే సమయంలో, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా పనిచేయ డాలన్నదే ఎల్‌డిఎఫ్ లక్ష్యం. కేరళ లౌకికవాదం, బహుళత్వాన్ని పరిరక్షించాలన్నది ఎల్‌డిఎఫ్ ప్రాథమిక వైఖరి. ఈ ఎన్నికల ఫలితాల నుండి వెలువడిన కొన్ని సంకేతాలు లౌకికవాదాన్ని పరిరక్షించాలని కోరుకునేవారికి ఆందోళన కలిగిస్తున్నాయి. బిజెపి మూడు సీట్లు గెలుచుకోవడం చాలా తీవ్రమైన అంశం. మతోన్మాదం ఏ రూపంలో వున్నా దానిపై రాజీ పడకుండా విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా మా పోరాటం కొనసాగుతుంది.

**బహిరంగంగా సమీక్షిస్తాం..**

ఇంతకుముందే చెప్పినట్లుగా, ఈ ఎన్నికల్లో తప్పుడు సమాచారం వ్యాపించింది. ఇందుకు సంబంధించి కొన్ని మీడియా సంస్థలు పోషించిన పాత్రపై తీవ్రంగా పరిశీలన జరపాల్సిన అవసరం వుంది. అర్ధ సత్యాలపై ఆధారపడే ప్రజంటేషన్లు, అతిశయోక్తులు, వాస్తవ విరుద్ధ ప్రచారాలు ప్రజాస్వామ్యానికి ఏ మాత్రమూ ప్రయోజనకరం కాదు. అయితే, ఈ అనుభవాల నుండి నేర్చుకుని, ముందుకు సాగడం ముఖ్యమని ఎల్‌డిఎఫ్ విశ్వసిస్తోంది. ఎన్నికల ఫలితాలను సమగ్రంగా సమీక్షించాలని, కామ్రేడ్‌లందరి అభిప్రాయాలను వినాలని ఎల్‌డిఎఫ్ నిర్ణయించింది. ప్రజాస్వామ్య పద్ధతిలో, బహిరంగ సమీక్ష జరపాలన్నది ఉద్దేశ్యం. ఎన్నికల ఫలితాలనంతరం ప్రజలు, పార్టీ కార్యకర్తల నుండి వెలువడే ఆందోళనలు, అభిప్రాయాలు, విమర్శలు అన్నింటినీ తీవ్రంగా పరిశీలిస్తాం. ప్రతి ఒక్కరి అభిప్రాయం విని నిర్ణయాలు తీసుకుంటాం. ఈ ఎన్నికల ప్రచారంలో ఎల్‌డిఎఫ్ కోసం వేలాదిమంది కార్మికులు పగలనక, రాత్రనక కష్టపడ్డారు. వారందరికీ మా అభినందనలు. యుడిఎఫ్, బిజెపి వంటి ప్రతిపక్ష శక్తులు, అలాగే నిర్దిష్ట మీడియా తీసుకున్న వైఖరి సృష్టించిన రాజకీయ వాతావరణంలో ఈ ఫలితం వచ్చింది. కొంతమంది వ్యక్తులు, నిర్దిష్ట అరాచక శక్తులు, రాజకీయేతర కేంద్రాలు సాగించిన తప్పుడు ప్రచారంతో తప్పుదారి నడిచారు. వారు వాస్తవాలు తెలుసుకునేలా తీవ్రమైన కృషి జరుగుతుంది. పోరాటం కొనసాగు తుంది.. ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తూ, మరింత శక్తి సామర్ధ్యాలతో పనిచేయడానికి మేం సిద్ధమయ్యాం. కార్పొరేట్ పిఆర్ వ్యూహాలు సాగించే తప్పుడు కథనాలు, బూటకపు ప్రచారం మమ్మల్ని వెనక్కి నెట్టలేవు. ఎల్‌డిఎఫ్ వైఖరుల్లో, జోక్యాల్లో లోపాలు, లొసుగులు ప్రజాస్వామ్య పద్ధతిలో పరిశీలిస్తాం. అవసరమైన దిద్దుబాట్లు జరుగుతాయి. ప్రజలతో మా బంధాన్ని బలోపేతం చేయడం ద్వారా ఎల్‌డిఎఫ్ మరింత స్పష్టతతో, విశ్వాసంతో ముందుకు సాగుతుంది. కేరళ భవితవ్యం, ప్రజల సంక్షేమం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం కోసం పోరాటం కొనసాగుతుంది. ఎల్‌డిఎఫ్‌తో నిలిచిన వారందరికీ మరోసారి కృతజ్ఞతలు. మరింత బలంగా తిరిగివస్తామని, కేరళ ప్రజల విశ్వా సాన్ని చూరగొంటామని మీకు హామీ ఇస్తున్నాం. ? ?

# ప్రజల సంతృప్తే కీలకం

జిల్లాలు, కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలని సూచించారు. జిల్లాల్లో అమలు చేసే ఉత్తమ పద్ధతులను బెస్ట్ ప్రాక్టీసెస్ మిగతా జిల్లా ల్లోనూ అమలు చేస్తామన్నారు. ఆ జిల్లా కలెక్టర్లనే వాటికి నోడల్ ఆఫీసరుగా పెడతామని చెప్పారు. శాఖ కార్యదర్శులు మూడు రోజులు, ఆ శాఖ విభాగాధిపతి 6 రోజులు, జిల్లా కలెక్టర్లు 8 రోజులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను సక్రమం గా వినియోగించుకోవాలని ఆదేశించారు. రాష్ట్రాభివృద్ధికి గ్రామస్థాయి ఉద్యోగులను కూడా ప్రేరేపించే బాధ్యత జిల్లా కలెక్టర్లే తీసుకోవాలని చెప్పారు. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పారు. రాజీవ్ గాంధీ హయాంలో సంక్షేమ పథకాల కోసం రూ.100లు ఖర్చు పెడితే ప్రజలకు రూ.10లు మాత్రమే అందేవని తెలిపారు. ప్రస్తుతం డిబిటి విధానంలో బటన్ నొక్కిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా వెళ్తున్నాయని వివరించారు. గత పాలకుల నుంచి రూ. 9.74 లక్షల కోట్ల అప్పులు, రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు సంక్రమించాయని విమర్శించారు. అందరి సహకారంతో అలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కి వ్యవస్థలను గాడిలో పెట్టగలిగామని చెప్పారు. జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నామని,వివిధ పాల సీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పారు. రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకోగలుగుతున్నామని చెప్పారు. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నామని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందన్నారు. మంత్రుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధి, ఉద్యోగి వరకూ అంతా బాధ్యతగా ఉండాలని తెలిపారు. ఆర్థికేతర ఫిర్యాదులను పరిష్కరించకుండా కొందరు పైకి కిందకు ఫైళ్లు తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. 2027 మార్చి నాటికల్లా రెవెన్యూ రికార్డులు పూర్తిగా ప్రక్షాళన కావాలని, భూముల విషయంలో ఎలాంటి తప్పులు లేకుండా రికార్డులు తయారు చేయాలని ఆదేశించారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి ఓ సైకిల్ అని పేర్కొన్నారు. అభివృద్ధి లేకుండా సంపద లేదని, సంపద లేకుండా సంక్షేమం లేదని వ్యాఖ్యా నించారు. డబ్బులు లేవనకుండా సంపద సృష్టికి పని చేద్దామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో భద్రత, భరోసా కల్పించామని, పి4తో ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నామని చెప్పారు. 26 కొత్త పాలసీలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రంపై నమ్మకాన్ని కల్పించామని తెలిపారు. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థను రాష్ట్రానికి తెచ్చామన్నారు. రూ. 23 లక్షల కోట్ల ఎంఒయూలు చేసుకున్నామని, ఇవి సాకారమైతే 24 లక్షల వరకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. డేటా, ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీలకు రాష్ట్రం కేంద్రంగా మారనుందని తెలిపారు. ఎసిలు రాష్ట్రం నుంచే సరఫరా చేసే పరిస్థితికి వచ్చామన్నారు. రోడ్లు, వంతెనలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని చెప్పారు.ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరికీ భయపడాల్సిన అవసరమే లేదన్నారు. ప్రజలతో సంబంధాలు ఎంత ముఖ్యమో, వారికి అందించే సేవలు కూడా అంతే ముఖ్యమన్నారు.

విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి 0.30 పైసల మేర కొనుగోలు వ్యయం తగ్గించామని, మరో 0.30 పైసలు త్వరలోనే తగ్గిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి టాపర్ల ఫోటోలతో యాడ్ ఇచ్చామని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చాటి చెప్పామన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ స్లోగన్ కాకూండా స్పీడ్ ఆఫ్ గ్రోత్గా ఉండాలని చెప్పారు. ఫైళ్లు కదలకుండా (ఫైల్స్ షుడ్ నాట్ మూవ్, రిజల్ట్స్ షుడ్ మూవ్) ఫలితాలు వస్తేనే ప్రజలకు మంచి సేవలు అందుతాయని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్, డిజిపి హరీష్ గుప్తా, మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, పి నారాయణ, పయ్యావుల కేశవ్, కె అచ్చెన్నాయుడు, ఎన్ఎండి ఫరూక్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత,నిమ్మల రామానాయుడు,బిసి జనార్ధన్ రెడ్డి, కందుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు. ?

# టీవీకే రానివ్వండి : ఎంకే స్టాలిన్

**చెన్నై- సూర్య వాస్తవం** తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన వైఖరిని స్పష్టం చేశారు. తమిళనాడులో తమిళ వెట్రి కజగం (టీవీకే) నేతృత్వంలోని ప్రభుత్వ ఏర్పాటుకు డీఎంకే ఎలాంటి ఇబ్బందులు సృష్టించదని, ఆరు నెలల పాటు ఆ ప్రభుత్వ కార్యకలాపాలను గమనిస్తుందని స్టాలిన్ తెలిపారు. తమిళనాడులో తక్షణమే రాజ్యాంగ సంక్షోభం గానీ, మరో ఎన్నికలు గానీ తాను కోరుకోవడం లేదని స్టాలిన్ స్పష్టం చేశారు. తన హయాంలో అమలు చేసిన ప్రాజెక్టులు కొనసాగాలని, టీవీకే తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తాను ఆశిస్తున్నట్లు స్టాలిన్ 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో అన్నారు. "కొత్త ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఉచిత అల్పాహార పథకాన్ని కొనసాగించాలి. మహిళా గృహ యజమానులకు నెలకు రూ.1,000 ఇచ్చే పథకాన్ని కూడా ఆపకూడదు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న విజయ్ హామీని అమలు చేయడం కష్టమవుతుంది. మేము ఇచ్చినట్లుగానే వారికి కనీసం రూ.1,000 అయినా ఇవ్వాలి," అని స్టాలిన్ అన్నారు. ఆయన ప్రభుత్వం 2021 మేనిఫెస్టోలో చేసిన హామీలలో 90 శాతాన్ని నెరవేర్చింది. ఈ ఎన్నికలలో కూడా అమలు చేయగలిగే విషయాలనే డీఎంకే హామీలుగా ఇచ్చిందని స్టాలిన్ అన్నారు.

## సంపాదకీయం

# కాంగ్రెస్ పునరాగమనం...



దక్షిణాదిలో కాంగ్రెస్ హవా కొనసాగుతున్నది. ఇప్పటికే కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారాన్ని దక్కించుకున్న హస్తం పార్టీ, ఇప్పుడు కేరళలోనూ జైత్రయాత్రను కొనసాగించింది. రెండేండ్లుగా దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకుంటూ వస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటకలో మొత్తం 224 స్థానాలకుగాను కాంగ్రెస్ ఏకంగా 135 స్థానాలను గెలుచుకుని భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ బీజేపీని కేవలం 66 స్థానాలకే పరిమితం చేసి తన సత్తా చాటింది. తెలంగాణలోనూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు బ్రేక్ వేస్తూ కాంగ్రెస్ సంచలన విజయం సాధించింది. మొత్తం 119 స్థానాల్లో కాంగ్రెస్ 65 స్థానాలను గెలుచుకొని రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారాన్ని చేజిక్కించుకుంది. కర్నాటక, తెలంగాణ తర్వాత ఇప్పుడు కేరళలోనూ విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలే స్తున్నది. ఈ విజయంతో దక్షిణాదిలో ప్రధాన రాష్ట్రాలన్నీ ఇప్పుడు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి.తాజాగా.. వెలువడిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ప్రభంజనం సృష్టించింది. దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) పాలనకు చరమగీతం పాడుతూ, కేరళ ఓటర్లు యూడీఎఫ్ వైపు మొగ్గు చూపారు.మొత్తం 140 స్థానాలు ఉన్న కేరళ అసెంబ్లీలో, యూడీఎఫ్ 102 స్థానాల్లో విజయం సాధించి స్పష్టమైన మెజారిటీని దక్కించుకుంది. ఇందులో ఒక్క కాంగ్రెస్ పార్టీయే 63 స్థానాలను గెలుచుకోవడం విశేషం. పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కేవలం 35 స్థానాలకే పరిమితమైంది. 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పశ్చిమ బెంగాల్, అస్సాంలలో బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టి ఉండవచ్చు. కానీ ఈ గణాంకాల వెనుక భారత రాజకీయ గమనాన్ని మార్చగల ఒక లోతైన కథ దాగి ఉంది. అది 'కాంగ్రెస్ పార్టీ పునరాగమనం'. పైకి ఓటమిలా కనిపిస్తున్నా, వ్యూహాత్మకంగా చూస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే అతిపెద్ద రాజకీయ లబ్ధిదారుగా అవతరించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా మలబార్ రీజియన్‌లో ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) తో కలిసి కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది.క్షిణ భారతదేశం కాంగ్రెస్ ఒక అభేద్యమైన కంచుకోట అని, ఇక్కడ బీజేపీ గడ్డు రాజకీయ పరిస్థితులను ఎదుర్కొంటోందని కేరళ ఫలితాలు మరోసారి నిరూపిస్తున్నాయి. ఈ విధంగా దక్షిణాన కర్ణాటక, తెలంగాణల తర్వాత కేరళలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడనుంది. నిజానికి కేరళలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల చరిష్మా, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు సురక్షిత ప్రాంతంగా మార్చాయి. కర్ణాటక, తెలంగాణ తర్వాత కేరళలోనూ గెలవడంతో దక్షిణ భారతదేశంలో కాంగ్రెస్ ఒక తిరుగులేని శక్తిగా ఎదిగింది. ఇక్కడ బీజేపీ ఎంత ప్రయత్నించినప్పటికీ, తన స్థానాలను పెంచుకోలేకపోయింది.2021లో బెంగాల్‌లో కాంగ్రెస్ రాష్ట్రంలో పూర్తిగా కనుమరుగు అయ్యింది. కానీ ఈ దఫా జరిగిన ఎన్నికల్లో బెంగాల్‌లో కాంగ్రెస్ 3% ఓట్ల వాటాను సంపాదించి, రెండు సీట్లను కూడా గెలుచుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ బలహీనపడటం కాంగ్రెస్‌కు వరంగా మారింది. టీఎంసీ పతనం తర్వాత ఏర్పడిన ప్రతిపక్ష శూన్యతను పూరించడానికి లౌకికవాద ఓటర్లు మళ్లీ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో ఇక్కడ పోరు బీజేపీ వర్సెస్ కాంగ్రెస్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత 15 ఏళ్లుగా మమతా బెనర్జీతో సంబంధం ఉన్న ముస్లిం ప్రాబల్య ప్రాంతంలో తన రాజకీయ పట్టును బలపరుచుకునేందుకు కాంగ్రెస్‌కు ఇప్పుడు అవకాశం ఉంది. బెంగాల్‌లో అధికార మార్పిడి భవిష్యత్తులో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీకి దారితీయవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక తమిళనాడులో నిజానికి రాష్ట్రంలో కాంగ్రెస్ ద్రావిడ రాజకీయ పార్టీల కారణంగానే అధికారం కోల్పోయి, తిరిగి రాలేక కేవలం ఒక 'జూనియర్ భాగస్వామి'గా మిగిలిపోయింది. కానీ ఇప్పుడు విజయ్ పార్టీ గెలుపు, అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి టీవీకేకు కాంగ్రెస్ అవసరం ఏర్పడటం చూస్తుంటే.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మళ్లీ మంచి రోజులు రాబోతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అస్సాంలో మైనారిటీ ఓటర్లు పూర్తిగా కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. బద్రుద్దీన్ అజ్మల్ ఓటమి అస్సాం భవిష్యత్ రాజకీయాలను ద్విముఖంగా మార్చేసింది. ఇప్పుడు బీజేపీకి ఓట్లను చీల్చే పార్టీలు ఏవీ మిగలకపోవడంతో, భవిష్యత్తులో కాంగ్రెస్‌కు అధికార పీఠం సులువుగా చేజిక్కించుకునే మార్గం కనిపిస్తోంది. ఐదు రాష్ట్రాల్లోని ఎన్నికల ఫలితాలు మమతా బెనర్జీ, స్టాలిన్, బద్రుద్దీన్ అజ్మల్ వంటి నాయకులను బలహీనపరిచి, ప్రతిపక్ష "ఇండియా" కూటమిలో కాంగ్రెస్‌ను అత్యంత శక్తివంతమైన పాత్రలో నిలబెట్టాయి. గత కొన్ని దశాబ్దాలుగా ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ, డీఎంకే బలంగా ఉండటం కాంగ్రెస్‌కు అతిపెద్ద సమస్యగా ఉండేది. ఈ 2026 ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు దేశ వ్యాప్తంగా ఒక కొత్త "అవకాశాన్ని" కల్పించాయని విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీ 'సాంస్కృతిక జాతీయవాదం'కు వ్యతిరేకంగా 'రాజ్యాంగ జాతీయవాదం'ను నిలబెట్టి ఓట్లు గెలుచుకోగలమని నిరూపించుకోవడానికి కాంగ్రెస్‌కు ఒక అవకాశం లభించిందని అంటున్నారు.2026 ఎన్నికల ఫలితాలు బీజేపీకి అధికారాన్ని ఇవ్వడంతో పాటు, కాంగ్రెస్‌కు ఒక ఆశాకిరణాన్ని కూడా అందించాయి. ఇకపై కాంగ్రెస్ కేవలం ఒక పార్టీ మాత్రమే కాదని, బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న ఏకైక శక్తి అని నిరూపించుకుంది.



# తెలుగు రాష్ట్రాల్లో తమిళ పాలిటిక్స్ హీట్

**హైదరాబాద్ -సూర్య వాస్తవం :**

విజయ్ విజయం తమిళనాడు పాలిటిక్స్‌లో హిస్టరీని క్రియేట్ చేసింది. కానీ తెలుగు స్టేట్స్‌లో దళపతి విక్టరీ రీసౌండ్ చేస్తోంది. ఏకంగా అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య సోషల్ మీడియా వార్‌కు దారితీసింది. ఇక సినీ స్టార్‌గా కెరీర్ ప్రారంభించి..పాలిటిక్స్‌లోకి వచ్చిన పవన్‌ను..విజయ్ విజయంతో పోలుస్తూ ట్రోల్ చేస్తున్న పరిస్థితి. ఇటు కేసీఆర్‌ను కూడా వదలడం లేదు సోషల్ మీడియా. విజయ్ విజయంపై ఇక్కడెందుకు ఇంత చర్చ? టీవీకే గ్రాండ్ విక్టరీ సెంట్రిక్‌గా ఒకరినొకరు ఎందుకు టార్గెట్ చేసుకుంటున్నట్లు? తెలుగు వార్తలుపార్టీ పెట్టిన రెండేళ్లలోనే విజయం. ఎంజీఆర్, ఎన్టీఆర్ తర్వాత ఆ స్థాయి రికార్డు విక్టరీ. అందుకే విజయ్ విజయం దేశం మొత్తం రీసౌండ్ చేస్తోంది. తెలుగు స్టేట్స్‌లో అయితే పొలిటికల్ హీట్‌ను..సోషల్ మీడియా ఫైట్‌ను మరో స్టేజ్‌కు తీసుకెళ్లింది. విజయ్ సాధించిన గెలుపుతో అందరూ ఆ క్రెడిట్‌లో భాగమయ్యేందుకు గేమ్ షురూ చేశారు. విజయ్ ప్రచారంలో ఓ అభిమాని జగన్‌తో ఆయన కలిసి ఉన్న ఫోటోను ఇస్తే..విజయ్ ఆ ఫోటోను తీసుకుని జనాలకు చూపించారు. ఆ విజువల్స్‌ను పోస్ట్ చేసి వైసీపీ సోషల్ మీడియా క్రెడిట్ కొట్టేసే ప్లాన్ చేస్తోంది. తమ అధినేత ఫోటో పెట్టుకుని విజయ్ గెలిచారన్నట్లుగా ఫ్యాన్ పార్టీ కలరింగ్ ఇస్తే..టీడీపీ స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తోంది. జగన్ ఫోటో పెట్టుకుని విజయ్ గెలిస్తే..జగనే అధ్యక్షుడిగా ఉండి వైసీపీని ఎందుకు 11 సీట్లకే పరిమితం చేశారో చెప్పాలని కూటమి నుంచి అటాక్ స్టార్ట్ అయింది. ఇక వైసీపీ మాజీమంత్రి రోజాను కూడా వదిలిపెట్టడం లేదు సోషల్ మీడియా. ఆమె డీఎంకేకు ప్రచారం చేశారని..ఆమె ఎక్కడ అడుగు పెడిగే అక్కడ నాశనమే..ఐరన్ లెగ్ అంటూ ట్రోల్స్ చేస్తున్నారు.ఇక అన్నింటికి మించి పవన్ సెంట్రిక్‌గా సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ అంతా ఇంతా



కాదు. విజయం అంటే విజయ్‌ది అని..ఒంటరిగా పోటీ చేసి తన బలంతో ..తానే 234 చోట్ల అభ్యర్థినని చెప్పి గెలిచారని హోరెత్తిస్తున్నారు. విజయ్‌తో పవన్‌ను పోలుస్తూ..ఏపీలో జనసేన పార్టీ పెట్టిన పదేళ్ల తర్వాత పవన్ డిప్యూటీ సీఎం అయ్యారంటూ ఎద్దేవా చేస్తున్నారు ఆయన రాజకీయ ప్రత్యర్థులు. 21 సీట్లు గెలిచే వంద శాతం స్ట్రైక్ రేట్ అని చెప్పుకుంటున్న జనసేనాని..విజయ్ సాధించిన విజయం తర్వాత ఎలా రియాక్ట్ అవుతారో అంటూ పోస్టులు పెడుతున్నారు. ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చిందన్నట్లుగా ఉందని..విజయ్ విజయం.. పవన్‌కు హెడెక్‌గా మారిందని వైసీపీ నేత అంబటి రాంబాబు ట్వీట్ చేసి చర్చకు దారితీశారు.సేమ్‌టైమ్ తెలంగాణ మాజీ కేసీఆర్‌ను కూడా కాంగ్రెస్ సోషల్ మీడియా ఓ రేంజ్‌లో ట్రోల్ చేస్తోంది. విజయ్ పార్టీ పెట్టే ముందు గులాబీ బాస్‌ను కలిశారని..ఆ తర్వాత తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సాధించారని బీఆర్ఎస్ సోషల్ మీడియా పోస్టులు పెడుతుంది. అయితే గులాబీ పార్టీకి అదే స్థాయిలో కాంగ్రెస్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చేస్తోంది. స్టాలిన్ నుంచి మమత వరకు..కేజ్రీవాల్ నుంచి పినరయ్ విజయన్ వరకు..కేసీఆర్‌ను కలిసిన అందరూ..చివరకు జగన్ కూడా..సీఎం పదవిని కోల్పోయారని ట్రోల్స్ చేస్తున్నారు. దొర హ్యాండ్ ఎంత దరిద్రమైందో అంటూ కాంగ్రెస్ సోషల్ మీడియా పెట్టిన పోస్ట్ ఫుల్ వైరల్ అవుతోంది.ఆంధ్రప్రదేశ్ వార్తలుఇలా విజయ్ విజయం చుట్టూ తెలుగు స్టేట్స్‌లో పెద్ద రచ్చే జరుగుతోంది. టీవీకే విక్టరీని తమకు అడ్వాంటేజ్‌గా మలుచు కునేందుకు.. ఏపీలో వైసీపీ కార్యకర్తలు, నేతలు టపాసులు కాల్చి, కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. క్రెడిట్ ఫైట్‌లో భాగంగా..ఎవరికి వారు సెల్ఫ్ ఎలివేషన్‌కు ప్రయారిటీ ఇవ్వడంతో వార్ పీక్స్‌కు చేరింది. దీంతో విజయ్ సెంట్రిక్‌గా ఒకరిని టార్గెట్ చేసుకుంటూ మరొకరు పోటాపోటీ పోస్టులతో హోరెత్తిస్తున్నారు. విజయ్ విజయం చుట్టూ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న చర్చ ఇంకెంత దూరం వెళ్తుందో చూడాలి.

# మారిపోతున్న ఎన(ర్న) లిస్టులు

**విజయవాడ -సూర్య వాస్తవం :**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో సంక్లిష్ట పరిస్థితి కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని ఓ వాతావరణం ఇప్పుడు ప్రధానంగా కనిపిస్తుండడం చర్చకు దారితీస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా టీవీ డిబేట్లతోపాటు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు ఇప్పుడు అదే పార్టీకి వ్యతిరేకంగా మారు తున్నారు. ఆ పార్టీ అగ్రనేతలపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అయితే వారిని దూరం పెట్టడం వల్ల అలా చెబుతున్నారా? లేకుంటే ఆశించిన స్థాయిలో వారికి చెల్లింపులు చేయడం లేదా? అందుకే వారు ఎదురు తిరిగారా? అనేది తెలియడం లేదు. ప్రధానంగా పాషా, కె ఎస్ ప్రసాద్ ఇప్పుడు వరుసగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వ్యతిరేకంగా ఒకరికొకరు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఇక సాక్షి ఛానల్ లో జరిగే డిబేట్ కు హాజరు కాబోమని తేల్చి చెబుతున్నారు. అయితే ఇంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వీరిని పెంచి పోషించిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఈ ఇద్దరు ఆ పార్టీ అగ్ర నేతలను వ్యతిరేకిస్తుండడం చూస్తుంటే తెర వెనుక ఏదో జరిగిందన్న అనుమానం వ్యక్తం అవుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాతో పాటు డిజిటల్ మీడియాలో పనిచేసే వారికి ఆశించిన స్థాయిలో చెల్లింపులు జరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పార్టీలో ఇటువంటి వాటిని సజ్జల రామకృష్ణారెడ్డి హ్యాండిల్ చేసేవారు. అయితే ఇప్పుడు చెల్లింపులు నిలిపివేయడంతో ఆయన టార్గెట్ అవుతున్నట్లు



పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. సాక్షి ఛానల్ డిబేట్ లు అంటే ముందుగా పాషా, కె ఎస్ ప్రసాద్ గుర్తుకు వస్తారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా డిబేట్లు ఇచ్చే వీరు అవసరం అనుకుంటే వ్యక్తిగత దాడికి దిగుతారు కూడా.

అంతలా ఉంటుంది వీరి జోరు. అయితే క్రమేపి ఇటీవల వారి నోరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై పడుతోంది. తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. ప్రధానంగా సాక్షిలో కనిపించే వీరు ఇకనుంచి ఆ ఛానల్ వైపు వెళ్ళమని చెబుతుండడం కూడా విశేషం.మొన్న మధ్యన జగన్మోహన్ రెడ్డి మావిగన్ ప్రతిపాదన తెచ్చిన సంగతి తెలిసిందే. మచిలీపట్నం-విజయవాడ= గుంటూరును కలుపుతూ మావిగన్ అని పేరు పెట్టాలని సూచించారు జగన్మోహన్ రెడ్డి. సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్స్ కు గురయ్యారు. ఆ సమయంలో విశ్లేషకుడి రూపంలో కేఎస్ ప్రసాద్ జగన్మోహన్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే ఆ తర్వాత సాక్షి ఛానల్ డిబేట్లో పాల్గొని భిన్నంగా స్పందించారు. దీంతో అందరూ పేటీఎం డబ్బులు దక్కకపోవడంతోనే కేఎస్ ప్రసాద్ అలా మాట్లాడారని.. సోషల్ మీడియా వేదికగా కామెంట్లు పెట్టారు. అదే సమయంలో పాషా సైతం జగన్ మావిగన్ ప్రతిపాదనను గట్టిగానే తిప్పి కొట్టారు. అయితే ఇప్పుడు ఏకంగా ఇద్దరూ ఒకరికొకరు ఇంటర్వ్యూలు ఇస్తూ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలపై విరుచు కుపడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి చుట్టూ వలయంగా ఏర్పడి పార్టీని పాతాళంలోకి నెట్టే స్తున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారు.

ప్రధానంగా సజ్జల రామకృష్ణారెడ్డి తీరుపై ఆ ఇద్దరూ ఇప్పుడు బాహటంగానే ఆరోపణలు చేస్తున్నారు. కోవర్టు అంటూ కొత్త ముద్ర వేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డికి ఎలివేషన్లు ఇచ్చి.. పక్కదారి పట్టించి.. పార్టీని పూర్తిగా భ్రష్టు పట్టించారన్న ఆరోపణలతో రెచ్చిపోతున్నారు. అయితే వీరికి చెల్లింపులు నిలిచిపోయాయని.. అందుకే అలా మాట్లాడుతున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అయితే సాక్షి ఛానల్ కు వెళ్తుంటే.. తమను పెయిడ్ ఆర్టిస్టుల మాదిరిగా చూస్తున్నారని..అందుకే అటువైపు వెళ్ళమని చెబుతున్నారు. మొత్తానికి ఇద్దరు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకులుగా మారిపోవడం చూస్తుంటే మాత్రం ఆ పార్టీలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది.

# పవన్ తప్పటడుగులు వేశారా...

## - సోషల్ మీడియాలో ప్రశ్నలు

**కాకినాడ-సూర్య వాస్తవం :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ వేసిన రాజకీయ అడుగు ఆయనను ముఖ్య మంత్రిని కానివ్వకుండా చేశాయి. ఆయనసరైన సమయం లో ఎంట్రీ ఇవ్వకపోవడంతో పాటు, పార్టీ పెట్టిన వెంటనే ఇతర పార్టీలకు మద్దతు ప్రకటించడం కూడా ఆయన ముఖ్యమంత్రి కాకపోవడానికి కారణాలయ్యాయి. 2014లో పార్టీ పెట్టి పోటీ చేయకుండా బీజేపీ, టీడీపీకి బేషరతుగా మద్దతు ఇవ్వడంతోనే ఆయన రాజకీయ ప్రయాణం డిప్యూటీ సీఎం వరకే నిలిచి పోయిం దంటున్నారు. పవన్ కల్యాణ్ తమిళనాడు ఎన్నికలను చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ధైర్యాన్ని ప్రదర్శించలేకపోవడం, రాజకీయ శూన్యత ఉందా? లేదా? అన్నది చూసుకోకుండా పార్టీ పెట్టడం కూడా పవన్ ను సీఎం కుర్చీకి దూరం చేసింది.టీవీకే చీఫ్ విజయ్ పార్టీ పెట్టిన రెండేళ్లకే అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చిన తీరుపై ఆంధ్రప్రదేశ్ లోనూ చర్చ జరుగుతుంది. పవన్ కల్యాణ్ విజయ్ లాగే చరిష్మా ఉన్న వ్యక్తి. లక్షలాది మంది అభిమానులు పవన్ సొంతం. ఇక కాపు సామాజికవర్గం మొత్తం ఆయన వెనక ఉంది. అదే ఆయనకు ప్లస్ పాయింట్ అయ్యేది. 2024 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఉంటే ఖచ్చితంగా సీఎం పదవి సులువుగా దక్కేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కానీ పవన్ కల్యాణ్ అది చేయకుండా పొత్తులతో సరిపెట్టుకుని, జగన్ ను ఓడించడమే ధ్యేయంగా పెట్టుకోవడం ఆయన డిప్యూటీ సీఎం వరకే ఆగిపోవాల్సి వచ్చింది.ఏదైనా పార్టీ పెట్టిన తొలి నాళ్లలో ఉన్న క్రేజ్, ఇమేజ్ రాను రాను తగ్గుతుంది. అది పవన్ కైనా, విజయ్ కైనా ఒకటే ఫార్ములా. రాజకీయ పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ తొలుత బీజేపీని తిట్టిపోశారు. తర్వాత అదే పార్టీతో చేతులు కలిపారు. తర్వాత బీఎస్పీ, కమ్యునిస్టులతో




కలసి నడిచారు. మళ్లీ టీడీపీ, బీజేపీతో జత కట్టారు. తనకంటూ ఒక సిద్ధాంతం ఉందని ప్రజలను నమ్మించలేకపోయారు. ఏదో వంద శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని గొప్పలు చెప్పుకోవడం కాదు... అది జగన్ వైఫల్య పాలన వచ్చిందని తెలుసుకుంటే మంచిది. రాజకీయ పార్టీ పెట్టినప్పుడు, మార్పు కావాలనుకుంటున్నప్పుడు అన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఆవేశంతో తీసుకున్న నిర్ణయాలు పవన్ ను అక్కడి వరకే ఆపివేస్తాయి. ఇక అడుగు ముందుకు పడాలంటే పవన్ కు కష్టమే. ఈ సూత్రాన్ని అర్థం చేసుకోని పవన్ కల్యాణ్ పొలిటికల్‌గా ఫెయిల్ అయినట్లేనన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా.

# అభివృద్ధి పనులే కూటమి లక్ష్యం

**- రోడ్డు పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి**



**పుట్లూరు – సూర్య వాస్తవం :** పుట్లూరు మండలంలోని నారాయణపల్లి నుండి వెంగనపల్లి గ్రామాల మధ్య ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా అడుగులు పడ్డాయి. సుమారు 55 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ రోడ్లు మరియు భవనాల శాఖ రహదారి పనులకు స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల నారాయణపల్లి వెంగనపల్లి గ్రామాల మధ్య రవాణా కష్టాలు తీరనున్నాయి. భూమి పూజ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో ఉరవకొండ విద్యార్థుల ప్రతిభ



**ఉరవకొండ – సూర్య వాస్తవం :** పర్యావరణ కాలుష్య నివారణే ధ్యేయంగా ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఒక వినూత్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో అందరి ప్రశంసలు అందుకుంది. పంట వ్యర్థాలను దహనం చేయడం వల్ల కలిగే కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు, రైతులకు ఆర్థికంగా చేదోడుగా నిలిచేలా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దారు. ఈ ఏఐ వ్యవస్థ జీపీఎస్ ద్వారా పంట వివరాలను, పొలాల విస్తీర్ణాన్ని ఖచ్చితంగా నమోదు చేసుకుంటుంది. ఏ ప్రాంతంలో ఎంత మేర పంట వ్యర్థాలు లభ్యమవుతాయో ఈ ప్రాజెక్టు ముందే గుర్తిస్తుంది. సాధారణంగా తగలబెట్టే పంట వ్యర్థాలను సేకరించి, వాటిని అవసరమైన పరిశ్రమలకు విక్రయించేలా ఈ వ్యవస్థ మార్గదర్శకత్వం వహిస్తుంది. దీని ద్వారా రైతులకు వ్యర్థాల నుండి అదనపు ఆదాయం లభిస్తుంది.

**రాష్ట్ర స్థాయి ప్రశంసలు:**

ఈ వినూత్న ఆలోచనకు 'సర్క్యులర్ ఎకానమీ' విభాగంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రాజెక్టును ప్రదర్శించి అధికారుల నుండి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. సాంకేతికతను సామాజిక ప్రయోజనం కోసం వాడుతూ, అటు పర్యావరణాన్ని, ఇటు రైతును రక్షించేలా ఈ ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, స్థానికులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో శిరిడి సాయిబాబాకి విశేషపూజలు

**- ప్రత్యేక అలంకారంలో సాయినాధుడు**

**- ఆలయ అభివృద్ధికి సహకరించండి**



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వ హించారు. ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయి నాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు . మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు.

**ఆలయ అభివృద్ధికి సహకరించండి**

ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా పథకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని, ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి లో దాతలకు విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాలలో రాణించిన విద్యార్థులకు ఘన సన్మానం



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఇటీవల విడుదలైన పదవ తర గతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం మోడల్ స్కూల్ చైర్మన్ పవన్ కు మార్ యాదవ్ ఆధ్వర్యంలో మే మొంటో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మోడ ల్ స్కూల్ చైర్మన్ పవన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కె హర్షిత, 584 ఏ అనురా 583,హర్షవర్ధన్ 578,బి లికిత 578 ఇటీవల విడు దలైన పదవ తరగతి ఫలితాల్లో గవ ర్నమెంట్ స్కూల్లో మోడల్ స్కూల్ గుత్తి మండలం టాపర్ గా రావడం అది చాలా సంతోషం ఐయ్యమని 500 మార్కులు 22 మంది సాధిం చారు.విద్యాశాఖ మంత్రి నారా లోకే ష్ తోనే సాధ్యమని, అది ప్రైవేట్ కా ర్పొరేట్ పాఠశాలలకు దీటుగా మోడల్ స్కూల్ విద్యార్థులు రాణించ డం హర్షదగ్గ విషయమని ఈ విజయం ఎంతో గర్వించే విషయమని నారా లోకేష్ తీసుకొచ్చిన సంస్కర ణలు రైసింగ్ స్టార్లు షైనింగ్ స్టార్లు విభజించి వాళ్ళల్లో వాళ్ళ కాంపిటీ షన్ పెట్టడం వల్ల మన రాష్ట్రంలోనే గవర్నమెంట్ స్కూల్లో అత్యధిక మా ర్కులు సాధించడం జరిగినది.అలా గే 100 డేస్ యాక్షన్ ప్లాన్ అంటూ పిల్లలకు ప్రతిరోజు ఒక సబ్జెక్టు స్లిప్ టెస్ట్ నిర్వహిస్తూ పిల్లలని బాగా ఇం ప్రూ మెంట్ చేసిన టీచర్స్ కావచ్చు ప్రిన్సిపాల్ కావచ్చు తగిన జాగ్రత్త లు తీసుకొని ఈ మార్కులు సాధిం చడం జరిగినది.ఇప్పుడు గవర్నమెం ట్ స్కూల్లో పేపర్లకు వచ్చిన ఘనత ఎప్పుడూ లేదు అలాంటిది నారా లోకేష్ విద్యాశాఖ మంత్రి అయిన ప్పటి నుంచి మెయిన్ పేజీకి గవర్న మెంట్ స్కూలో సాధించిన మార్కు లు విద్యార్థిని విద్యార్థులు ఫోటోలతో సహా రావడం జరిగింది. నారా లోకేష్ విద్యాసంస్థలు ఇంకా మును ముందు మంచిగా సంస్కరణలు తీసుకొని రావాలని అలాగే విద్యార్థు లు కూడా కోరుకుంటున్నారు విద్యా ర్థులు అంత కలిసి నారా లోకేష్‌కి నా థాంక్యూ అని చెప్పడం జరిగిన ది.విద్యార్థులను సన్మానించడం అ దృష్టంగా భావిస్తూ మున్ముందు మీరు విద్యలో బాగా రాణించాలని కో రుకుంటున్నామని వాళ్ళని,వారి త ల్లిదండ్రులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రి న్సిపల్ ప్రసస్త కుమారి,టీచర్స్ విశా లాక్షి, సుబ్బా రాయుడు, అశోక్ సిబ్బంది పేరెంట్స్ కమిటీ మెంబర్స్ శ్రీధర్, మనోహర్, బాలకృష్ణ,చంద్రమో హన్,లక్ష్మీ కమిటీ మెంబర్లు విద్యార్థులు పేరెంట్స్ ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# బైకును ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

**- ఒకరు మృతి, మరొకరికి గాయాలు**



**వేముల – సూర్య వాస్తవం :** బైకును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన సంఘటన గురువారం వేముల మండల పరిధిలోని కొత్తచెరువు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేంపల్లి మండల పరిధిలోని యరమారపల్లె గ్రామానికి చెందిన జైపాల్ (65), చిన్న గంగన్న యరమారపల్లి నుంచి పులివెందులలోని పెండ్లికి బైక్ పై వెళుతున్నారు. అదే సమయంలో వేముల కొత్తచెరువు వద్దకు చేరుకోగానే వెనుక వైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో జైపాల్ చిన్న గంగన్నకు తలకు తీవ్రగాయా లయ్యాయి. వెంటనే పులివెందుల ఆసుపత్రికి తరలించారు. పులివెందు ఆసుపత్రిలో జైపాల్ మరణించడం జరిగింది. ప్రస్తుతం చిన్న గంగన్న పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం చిన్న గంగాన పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. వాహనంతో సహా డ్రైవర్ పరారీ అయినట్టు స్థానికులు తెలిపారు.

# గ్రామంలోనే సమస్యలు పరిష్కారం చేస్తాం

**- తహశీల్దార్ పుణ్యవతి**




**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామంలో గురువారం ఒక నెల ఒక గ్రామం నా లుగు సందర్శనల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహశీల్దార్ పుణ్యవతి హాజర య్యారు.ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామస్థాయిలో భూసమ స్యలు,ప్రజల సమస్యలను గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కరించడం దీని ప్రధాన ఉద్దేశ్యమని గ్రామస్తులకు తెలిపారు. అనంతరం గ్రామంలోని రైతులను సమస్యల గురించి ఆరా తీశారు.

# బస్టాండ్‌లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

**- సీఐ రామారావు**

**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో వున్నా గుత్తి బస్టాండ్లో ప్రయాణికులు తమ సా మగ్రి,బంగారు ఆభరణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సీఐ రామా రావు సూచించారు. సీఐ రామారావు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు,నీళ్లు తీసుకోవద్దని హెచ్చరించారు. బస్టాండ్ పరిసరాల్లో అనుమాని తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# కలెక్టర్లకు దిశా నిర్దేశం చేసిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్




**ఉరవకొండ – సూర్య వాస్తవం :** జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆర్థికమంత్రి పేర్కొన్నారు. కేవలం నిధులు ఖర్చు చేయడం మాత్రమే కాకుండా, ఆ ఖర్చుతో ప్రజలకు ఎంత ప్రయోజనం కలిగిందో కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ ఆదాయ వనరులను పెంచేందుకు రెవెన్యూ వచ్చే శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్ది ఆదాయం పెంచితే, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. సాంకేతిక, డిజిటల్ మౌలిక వసతులను ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి కోరారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, మన ప్రభుత్వం వ్యర్థ ఖర్చులు లేకుండా సమర్థవంతమైన వ్యవస్థతో సంక్షేమ రంగంలో ఉత్తమ సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన ప్రాధాన్యత ప్రకారం శాఖలు, కలెక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సాగునీరు, రహదారులు, ఆసుపత్రులు సహా ఇతర రంగాల్లోనూ అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలకు సమర్థవంతమైన ఫలితాలు అందించాలన్నారు.

# ముమ్మరంగా గృహ గణన సర్వే

**- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు**





**పులివెందుల – సూర్య వాస్తవం :** జనగణన 2027 ప్రక్రియలో భాగంగా పులివెందుల పట్టణ పరిధిలో జరుగు తున్న గృహ జాబితా, గృహ గణన సర్వేను ఆర్డిఓ చిన్నయ్య, సెన్సెస్ చార్జ్ ఆఫీసర్ మున్సిపల్ కమిషనర్ సి.మునిక ుమార్ గురువారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.పట్టణంలోని 19,28 మరియు 70వ హౌస్ లిస్టింగ్ బ్లాకుల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను పులివెందుల రెవెన్యూ డివిజనల్ అధికారి సెన్సస్ చార్జ్ ఆఫీసర్ మరియు మున్సిపల్ కమిషనర్ సంయుక్తంగా పరిశీలించారు. అధికారులు స్వయంగా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో, ఎటువంటి పొరపాట్లు లేకుండా అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పని చేస్తూ ప్రతి ఇంటినీ తప్పకుండా సందర్శించి వివరాలు సేకరించాలని సూచించారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఎంతో ఉపయోగ పడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు సర్వే ప్రాముఖ్యతను గుర్తించి,సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించి సర్వేను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఎన్యూమరేటర్లు బయమత్ బాబు, సల్మా బేగం, రాజగోపాల్, రోహిణి, మల్లేశ్వర్ రెడ్డి, అయేషా తదితరులు పాల్గొన్నారు.

# సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు



**పులివెందుల - సూర్య వాస్తవం :** కృషి విజ్ఞాన కేంద్రం కడప ఊటుకూరు వారు పులివెందులలో చెన్నారెడ్డి కాలనీలో వ్యవసాయ, ఉద్యాన రైతులకు సమతుల్య ఎరువుల వినియో గంపై అవగాహన కార్యక్రమము నిర్వహించడం, డిబిటి బయోటెక్ కిసాన్ హబ్ ద్వారా జీవన ఎరువులు, జీవ శిలీంద్రనాశననుల పంపిణీ చేయడం జరిగింది. డా.వి.శిల్పకళ కార్యక్రమ సమన్వయ కర్త మాట్లాడుతూ విచక్షణాయుతంగా రసాయనక ఎరువులను వాడడం వల్ల భూసమతుల్యత దెబ్బతిని పంట ఉత్పాదకత తగ్గిపోతుంది అని, కేవలం రసాయన ఎరువుల ద్వారా పంటను పండిస్తున్న రైతులు నేల, పంట ఉత్పాదకపై హానికరమైన ప్రభావాన్ని చూపుతూ పోషకాల సమతుల్యత లోపించడం జరుగుతున్నది. ప్రస్తుత సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలో వాడే వివిధ సేంద్రియ ఎరువులలో జీవన ఎరువులు వాడకం ద్వారా తక్కువ ఖర్చుతో భూమి సారవంతం అయ్యేలా చేయొచ్చని తెలియజేశారు. డా. కే. సాయి మహేశ్వరీ, శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం వారు జీవన ఎరువులు ఆవశ్యకత ప్రాధాన్యత రోజుకు పెరుగుతూ ఉన్నది, జీవన ఎరువులు అనేవి పొడి లేదా ద్రవరూపంలో ముఖ్యమైన సూక్ష్మజీవులతో ఉండి, వీటిని విత్తనశుద్ధి ద్వారా లేదా సేంద్రియ ఎరువులతో కలుపుకొని లేదా మొక్కలపై పిచికారి ద్వారా లేదా డ్రిప్ ద్వారా కుడా వాడవచ్చు అని, అలాగే వివిధ పంటలలో వాడవలసిన జీవన ఎరువుల గురించి వాటి మోతాదు గురించి, వాడవలసిన విధానం గురించి మరియు జీవన ఎరువుల ఉపయోగం వల్ల ప్రయోజనాలు, వాడే విధానంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. డా.ఎస్. మానస శాస్త్రవేత్త( ఉద్యాన విభాగం) చీనీ, నిమ్మ, అరటి పంటల్లో సమగ్ర పద్ధతిలో పోషక మరియు వేసవి నీటి యాజమాన్యం గురించి వివరించారు. చీనీ, నిమ్మల్లో ఎక్కువగా గమనించే పిందె రాలే సమస్యను నివారించే యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులతో సంభాషిస్తూ, వారు ముఖ్యం గా ఎదుర్కొనే బంక కారు తెగులు, వేరు కుళ్ళు మరియు ఎండు తెగులు నియంత్రణకై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అరటిలో వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తల తో పాటు గెలల యాజమాన్యం తెలియజేశారు. డా. మహేష్ బాబు శాస్త్రవేత్త ( విస్తరణ విభాగం)వారు ప్రస్తుత పరిస్థితుల కారణంగా సమతుల్య ఎరువుల వినియోగం రైతులు దృష్టి సారించాలని అందులో ముఖ్యమైనది భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టాలని తెలియజేశారు అలాగే మట్టి నమూనా సేకరణ పద్ధతుల గురించి నమూనా విశ్లేషణ పత్రంలో పొందుపరిచే అంశాల గురించి క్లుప్తంగా వివరించారు. పచ్చి రొట్టె ఎరువులు పచ్చి ఆకులు, మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారు చేస్తున్న పీఎండీఎస్ కిట్ల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గిరీష్, యువ నిపుణులు, పాలెం చంద్ర, 30 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

# రైతన్నకు అండగా మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్



**శింగనమల- సూర్య వాస్తవం :** సింగనమల మండలం కల్లమడి గ్రామంలో మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి సింగనమల సమన్వయకర్త సాకే శైలజనాథ్ మొక్కజొన్న, వరి పొలాల్లో పంటను పరిశీలించారు మొక్కజొన్న వరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు రైతులకు గిట్టుబాటు ధర లేక పంటను పొలాల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది రైతుల ఆవేదన ఈ కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా అని డాక్టర్ శైలజానాథ్ ప్రశ్నించారు. "అన్నదాత కన్నీరు మంచిది కాదు చంద్రబాబు నాయుడు మాటలు కోటలు దాటుతున్నాయి కానీ రైతుల సమస్యలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. సమస్య ఇంత తీవ్రంగా ఉంటే సివిల్ సప్లయ్స్, వ్యవసాయ శాఖ మంత్రులు ఏమి చేస్తున్నారు. రైతుల పక్షాన నిలబడాల్సిన ఎమ్మెల్యే ఎక్కడున్నారు?" అంటూ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగనమల నియోజక వర్గంలోని కల్లుమడి గ్రామంలో నేరుగా పంట పొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడి వారి కష్టాలు, సమస్యలు తెలుసుకున్నారు. పొలాల్లోనే వదిలేసిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని పరిశీలించి రైతుల పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తక్షణమే మద్దతు ధర ప్రకటించి కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 11వ తేదీన రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని వినతిపత్రం అందజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్ రెడ్డి, మండల కన్వినర్ పరందామరెడ్డి,స్థానిక రైతులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు మరియు ప్రజలు యువత పాల్గొన్నారు.

## శ్రీ వృషభాచలేశ్వర స్వామి వారిని దర్శించుకున్న రీజనల్ జాయింట్ కమిషనర్



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లెలోని ఎద్దులకొండ పైన వెలసిన శ్రీ వృషభాచలేశ్వర స్వామి వారిని గురువారం తిరుపతి దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమీషనర్ చంద్రశేఖర్ ఆజాద్ దర్శించుకున్నట్లు ఆలయ ఇఓ శుభాష్ ,చైర్మన్ పీవీ.రమణ తెలిపారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ చరిత్ర గురించి ముఖ్య అర్చకులు హరిప్రవీణ్ ని అడిగి తెలుసుకున్నారు. ఎద్దుల కొండ వద్ద ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చేసి చెట్లను పెంచాలని, శ్రీ స్వామివారి అలంకరణకు తులసి చెట్లు పెంచాలని, అదేవిధంగా గ్రామం లోగల స్వామి వారి ఉత్సవమూర్తులను వెంటనే ఎద్దులకొండపైన స్వామి వారి మూలవర్ల సన్నిధిలో ఉంచి పూజలు జెరిగేలా చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అలాగే ఎద్దులకొండపైన రాజగోపుర ప్రకార నిర్మాణానికి తగిన ప్రతిపాదనలను పంపించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా దేవాదాయ శాఖ సహాయక కమీషనర్ శంకర బాలాజీ దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి "ఒక నెల - ఒక గ్రామం" సందర్శన

**- తహసీల్దార్ విజయ కుమారి**

**చెన్నూరు - సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వ రెవిన్యూ శాఖ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం, భూ వివాదాలను నివారించడం, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేందుకు చేపట్టిన "ఒక నెల - ఒక గ్రామం" సందర్శన కార్యక్రమాన్ని గురువారం మండలంలోని ముండ్లపల్లి గ్రామంలో నిర్వహించినట్లు తహసీల్దార్ విజయ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల నుండి భూ సంబంధిత వినతులు, సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యల కోసం సూచనలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు మండల సర్వేయర్, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొంటు న్నారని తెలిపారు. గ్రామస్థాయిలోనే ప్రజా సమస్యలు, రెవిన్యూ మరియు భూ సంబంధిత వివాదాలను పరిష్కరించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆమె వివరించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.కిరణ్ మోహన్ రావు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



## 'పది'లో ప్రతిభ చాటిన సుహానను అభినందించిన ఎంపీ వై.యస్.అవినాష్ రెడ్డి

**- ప్రతిభ కు పేదరికం అడ్డుకాదని నిరూపించిన సుహాన**

**- భవిష్యత్తు విద్యావంతులదే..**



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పార్లమెంటు సభ్యులు వై.యస్.అవినాష్ రెడ్డి క్యాంప్ కార్యాలయం లో పులివెందుల మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ హాఫీజ్ ఇస్లాంపురం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థి పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 524/600 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా ప్రథమ స్థానాన్ని సాధించిన సందర్భంగా .. విద్యార్థి ప్రతిభను గుర్తించి .. వారి కుటుంబ కటిక పేదరికంతో, తండ్రి చిన్న టైలర్ వృత్తితో కుటుంబాన్ని భారంగా నెట్టుకొస్తున్న పరిస్థితులలో కష్టపడి చదివి మంచి మార్కులు తీసుకొనిరావడం జరిగిందని... వారిని కడప పార్లమెంటు సభ్యులు వై.యస్. అవినాష్ రెడ్డి విద్యార్థిని, వారి తల్లిదండ్రులను అభినందించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ " చదువుకు పేదరికం అడ్డు కాకూడదని, ఎట్టి పరిస్థితులలో కూడా చదువు ను కొనసాగించాలని , భవిష్యత్తులో ఉన్నత చదువులకు తన వంతు సహాయసహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారన్నారు.

## గండి కుంభాభిషేక మహోత్సవానికి తులసి రెడ్డిని ఆహ్వానించిన ప్రధానార్చకులు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గం, చక్రాయపేట మండలం గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం కుంభాభిషేకమహోత్సవం మే 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతుంది. ఈ మహోత్సవానికి రావలసిందిగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మెన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డిని ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ఆహ్వానించారు. తప్పక వస్తానని తులసి రెడ్డి అన్నారు.


## ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్తలు తీసుకోవాలి

**- ఫైర్ ఆఫీసర్ బి.శివరాం రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** అగ్ని ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణపాయం నుండి బయట పడవచ్చు అని అగ్నిమాపక అధికారి బి.శివరాం రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజీవ్ నగర్ లో అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదాల జరిగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాదం పట్ల అవగాహన, ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై వివరించడం జరిగిందన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సురేంద్రరెడ్డి,మహమ్మద్ రఫీ, నాగేశ్వర్ రెడ్డి, నవీన్ కుమార్, రెడ్డి, ఆసిఫ్, చిన్ను పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎడిసిసి బ్యాంకు చైర్మన్



**గార్లదిన్నె- సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం గుడ్డలపల్లి గ్రామ వాసులైన ఉల్లికంటి సూర్యనారాయణ కూతురు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడిసిసి బ్యాంకు చైర్మెన్ ముంటిమడుగు కేశవరెడ్డి. నూతన జంటను ఆశీర్వదిస్తూ వీరి వివాహ జీవితం నిండు నూరేళ్లు ఆనందంతో పిల్లా పాపలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కేశవరెడ్డితో పాటు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని నూతన జంటను ఆశీర్వదించారు.

## కొండపల్లిలో ఉమామహేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం

### - పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి



**పుట్లూరు - సూర్య వాస్తవం :** పుట్లూరు మండలం, కొండపల్లి గ్రామంలో జరిగిన నూతన ఉమా మహేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆధ్యాత్మిక శోభతో మిన్నంటింది. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి ఈ వేడుకలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపారు. పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. నూతనంగా నిర్మించిన ఈ ఉమా మహేశ్వర స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నాను. భక్తి భావం సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుంది. గ్రామ ప్రజలు ఇంతటి వైభవంగా ఆలయ ప్రతిష్టాపన చేయడం అభినందనీయం. ఈ కార్యక్రమం గ్రామంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది, భక్తులు స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి



**తాడిపత్రి - సూర్య వాస్తవం :** మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి స్వయంగా శ్మశానవాటికను సందర్శించి, అక్కడ జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను దగ్గరుండి పరిశీలించారు. వేగవంతం చేయాలని ఆదేశం పనుల నాణ్యతలో రాజీ పడకుండా, సాధ్యమైనంత త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన సంబంధిత వ్యక్తులకు సూచించారు. అధునాతన సౌకర్యాలు ఈ శ్మశానవాటికను కేవలం సాధారణంగా కాకుండా, అన్ని రకాల అధునాతన సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులోకి పనులు పూర్తయిన వెంటనే, అధునాతన హంగులతో కూడిన ఈ శ్మశానవాటిక ప్రజల వినియోగానికి సిద్ధం కానుంది.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి నిత్య అన్నదాన వంటశాల నిర్మాణం



**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం నందు మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యంలో 25 లక్షల రూపాయలు వ్యయంతో హైదరాబాద్ వాస్తవ్యులు పోకరాజువారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన సత్రం నందు వంట శాల నిర్మించినందుకు ముందుకొచ్చి నిర్మాణం చేపడుతున్నట్లు మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు. గతంలో వీరు నిత్యాన్నదాన సత్రంలో గ్రానైట్ బండ పరుపును కూడా నిర్మించినట్లు ఆయన తెలిపారు.

## రైతులు యాంత్రిక పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

### - మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి

**చెన్నూరు - సూర్య వాస్తవం :** వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పనిముట్లు సరఫరా చేయడానికి రైతు యాప్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రాలను సందర్శించి పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న మరియు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఈ పథకం కింద లబ్ధి పొందిన వారు అర్హులు కారని, కౌలు కార్డు కలిగిన రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలలో కనీసం మూడు సీజన్లలో పంట నమోదు చేసుకున్న రైతులు అర్హులని తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని, లబ్ధిదారుల ఎంపిక ఆన్లైన్ లాటరీ విధానం ద్వారా నిర్వహించి జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో మంజూరు పత్రాలు అందజేయబడతాయని వివరించారు. మరిన్ని వివరాల కోసం రైతులు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని ఆమె కోరారు.

# మహిళలకు, బాలికలకు రక్షణ కవచం శక్తి యాప్

### - సి.ఐ నరసింహులు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు సి.ఐ నరసింహులు తెలియజేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, పాఠశాలలు కళాశాలల్లో, వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లలో, మహిళలు ఉద్యోగాలు చేసే కంపెనీలలో, గ్రామాలలో, కాలనీలలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని వేంపల్లె సి.ఐ నరసింహులు తెలిపారు. ఈ యాప్ ప్రాముఖ్యత, దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై వేంపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్తుకూరు గ్రామంలో గురువారం సాయంత్రం గ్రామస్తులకు వేంపల్లె సి.ఐ నరసింహులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**శక్తియాప్ ఎలా ఉపయోగించాలి?**

ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నపుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్.ఓ.ఎస్ బటన్, డయల్ 112 నెంబర్ కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను వేంపల్లె సి.ఐ నరసింహులు గుర్తు చేశారు. డయల్ 100/112 (అత్యవసర సహాయం)చైల్డ్ లైన్ 1098, (పిల్లల రక్షణ) గృహ హింస181,మహిళ వేధింపులు 1091,సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930,సైబర్ మిత్ర ప్రతి మహిళ తమ భద్రత కోసం ప్రభుత్వ కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి, వారిని చైతన్యవంతులను చేశారు అని తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభసాటి

### - ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలి
### - వ్యవసాయ సహాయ సంచాలకులు జి లక్ష్మి మాధవి



**చెన్నూరు - సూర్య వాస్తవం:** ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గి రాబడి ఎక్కువగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయ సంచాలకులు జి లక్ష్మీ మాధవి తెలిపారు. గురువారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వారి ఆధ్వర్యంలో రైతుల విజ్ఞాన యాత్రను నిర్వహించారు. ఇందులో భాగంగా ఉప్పరపల్లె గ్రామంలో గాజులపల్లి జగన్మోహన్ రెడ్డి అనే రైతు తనకు సంబం ధించిన పదహారు ఎకరాలలో ఆరేడు సంవత్సరాల నుండి కృతి వ్యవసాయం చేస్తూ ఉన్న ఫామ్‌ను సందర్శించి అక్కడ పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. అలాగే వివిధ రకాల కషాయాలను రైతులకు చేసి చూపించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచా లకులు జి లక్ష్మీదేవి మాట్లాడుతూ, రైతులు మొదటగా తమ పొలాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరించి అనుభవం సంపాదించిన తరువాత తమకు ఉన్న మొత్తం పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తరించాలని తెలిపారు. దీనివలన చాలా ఆరోగ్య కరమైన పంటలను పండించుకోవచ్చునని తెలిపారు. అలాగే మూలధారమైన సేంద్రియ కర్బన శాతాన్ని నేలలో పెంచుకోవాలని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం వలన సాగు ఖర్చును తగ్గించుకుని నాణ్య మైన ఉత్పత్తులు సాధించవచ్చునని తెలియజేశారు. అధికంగా యూరి యాను వాడరాదని యూరియాను అధికంగా వాడటం వలన చీడపీడలు ఎక్కువ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప చెన్నూరు కాజీపేట పెండ్లిమర్రి ఒంటిమిట్ట సికే దిన్నె మండలాల వ్యవసాయ అధికారులు రైతులు ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పచ్చి రొట్టె విత్తనాలు పంపిణీ



**చెన్నూరు - సూర్య వాస్తవం:** మండలంలోని రైతులకు సబ్సిడీ ధరతో ప్రభుత్వం పచ్చి రొట్టె విత్తనాలు పంపిణీ చేస్తున్నదని గురువారం మండల వ్యవసాయ అధికారి కె శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం 50% సబ్సిడీతో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నదని దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయని ఆమె తెలిపారు. జీలగలు పూర్తి ధర క్వింటాకు రూ, 16,000లు ఉండగా సబ్సిడీ ధర రూ,8000 లు ఉన్నాయని అలాగే జనుము పూర్తి ధర క్వింట రూ 15 400 లు ఉండగా సబ్సిడీ ధర రూ. 7700లు, కాగా పిల్ల పెసర పూర్తి ధర క్వింటాకు రూ. 19600లు ఉండగా సబ్సిడీ ధర రూ. 9800లు అని తెలియజేశారు. ఒక ఎకరా పొలం ఉన్న రైతుకు పది కిలోలు ఒకటి నుండి2 ఎకరా ఉన్న రైతుకు 20కిలోలు, రెండు నుండి మూడు ఎకరాలు ఉన్న రైతులకు 30 కిలోలు మూడు నుండి నాలుగు ఎకరాలు ఉన్న రైతులకు 40 కిలోలు ఆ పైబడి ఉన్న రైతులకు ఎన్ని ఎకరాలు ఉన్న పరిమితంగా 50 కిలోలు ఇవ్వబడుతుందని ఆమె తెలియజేశారు. కావున రైతులు తమ గ్రామ రైతు కేంద్రాలకు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకొని రావాలని ఆమె తెలిపారు. ఒక ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

### - ఆర్‌డీటీ కార్యాలయం గేట్ సమీపంలో రోడ్డు ప్రమాదం...!
### - స్థానికుల చొరవతో గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు






**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయలైన ఘటన గురువారం నాడు అనంతపురం లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..... అనంతపురం పట్టణంలోని స్థానిక ఆర్ డి టి కార్యాలయ గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ, అక్కడ పనిచేసిన తీరు ఆలస్యంగా ఉండటంతో గాయపడిన వ్యక్తికి మరింత ఇబ్బంది కలిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అక్కడున్న ప్రజలే ముందుకు వచ్చి గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో ఎక్కించి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. గాయపడిన వ్యక్తి పసులూరు గ్రామానికి చెందిన పితు నారాయణరెడ్డిగా గుర్తించారు. ఘటన స్థలంలో ఉన్న రాయల్ ఎంఫిల్డ్ బుల్లెట్ బైక్ నంబర్ ఏపీ02 సీ.ఎఫ్ 2778గా గుర్తించారు.

# ఆ పాత్రకు నేను సరికాదనిపించింది!



అమిర్‌ఖాన్ తనయుడు జునైద్ నటించిన బాలీవుడ్ చిత్రం 'ఏక్ దిన్'. ఈ చిత్రంలో సాయి పల్లవి కథానాయికగా నటించారు. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి మిశ్రమ స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమాలో తన క్యారెక్టర్‌పై సాయి పల్లవి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'ఏక్ దిన్' సినిమా చేయడానికి ముఖ్య కారణం కథ. మేకర్స్ నన్ను సంప్రదించిన సమయంలో చాలా భావోద్వేగభరిత, బరువైన పాత్ర గల చిత్రాల్లో నటిస్తున్నాను. అందుకే మనసుకు కాస్త హాయిగా, ఒత్తిడి లేని లైటర్‌వే క్యారెక్టర్ చేయాలనుకున్నా. ఈ కథ విన్నప్పుడు హాలీవుడ్ క్లాసిక్ 'బిఫోర్ సన్‌రైజ్' మూవీ గుర్తుకు వచ్చింది. అందుకే వెంటనే ఓకే చెప్పాను. అయితే ప్రీమియర్ షో చూసిన తర్వాత ఇందులో పోషించిన మీరా రంగనాధన్ పాత్రకు నేను సరిపోలేదని అనిపించింది. ఇదే విషయాన్ని అమిర్‌ఖాన్‌తో చెప్పాను. నన్ను కాకుండా చురుగ్గా ఉండే కొత్త అమ్మాయిని ఎంపిక చేసుంటే బాగుండేదేమో.. వాళ్లు ఈ పాత్రకు న్యాయం చేసేవాళ్లు' అని నా మనసులో మాటను ఆయనకు చెప్పాను' అన్నారు. అయితే హీరో జునైద్ మాత్రం ఆమె మాటలను అంగీకరించలేదు. ఈ పాత్రకు సాయి పల్లవి పర్ఫెక్ట్ సెలెక్షన్ అని అన్నారు. జునైద్, సాయి పల్లవి జంటగా సునీల్ పాండే దర్శకత్వం వహించిన చిత్రమిది.

# సందీప్ కిషన్ 'పవర్‌పేట' గ్లింప్స్..

## ఈ మాస్ ఎంట్రీ అరాచకం




టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న కొత్త సినిమా 'పవర్‌పేట' గ్లింప్స్ విడుదలైంది. కృష్ణ చైతన్య దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాపై మొదటి నుంచి ఒక రకమైన పాజిటివ్ బజ్ ఉంది. లేటెస్ట్‌గా విడుదలైన విజువల్స్ చూస్తుంటే, సందీప్ కిషన్ ఈసారి ఒక పక్కా లోకల్ మాస్ క్యారెక్టర్ లో పవర్ఫుల్ పెర్ఫార్మెన్స్ ఇవ్వబోతున్నారని అర్థమవుతోంది. పీరియడ్ డ్రామాగా, ఏలూరు నేపథ్యంలో సాగే ఈ పొలిటికల్ థ్రిల్లర్ గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అసలు విషయం ఏంటంటే, గ్లింప్స్ లో సందీప్ కిషన్ లుక్, ఆయన చెప్పిన డైలాగులు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. సందీప్ ఇందులో సేనాపతి రవి అనే పాత్రలో కనిపించబోతున్నాడు. "అడవిలో సింహం ఉచ్చ పోసి ఇది నా చోటు అని చెబుతుంది.. ఇక్కడ ఉచ్చ పోయిస్తే కానీ ఈ చోటు నీది కాదు" అంటూ ఆయన చెప్పిన డైలాగ్ సినిమాలో ఆ ర్రా వైబ్ ని చూపిస్తోంది. గ్లింప్స్ లో బాణసంచా కాలుస్తూ, స్పైసీ లుక్ లో సందీప్ కనిపిస్తున్న తీరు చూస్తుంటే, ఆయన కెరీర్ లోనే ఇది ఒక గుర్తుండిపోయే పాత్ర అయ్యేలా ఉంది. ఏ సినిమా చేసినా అందులో లోకల్ నెటివిటీని, రా పాలిటిక్స్‌ను చాలా సహజంగా చూపిస్తారు. 'పవర్‌పేట' గ్లింప్స్ లో కూడా అదే కనిపిస్తోంది. పవర్ స్ట్రగుల్ వ్యక్తిగత గౌరవం చుట్టూ తిరిగే ఈ కథలో మాస్ ఎలిమెంట్స్ ను పక్కాగా బ్యాలెన్స్ చేయనున్నారట. మణిశర్మ అందించిన నేపథ్య సంగీతం ఈ గ్లింప్స్ కు ఒక రేంజ్ ఎలివేషన్ ఇచ్చింది. విజువల్స్ పరంగా మది సినిమాటోగ్రఫీ చాలా రిచ్ గా ఉంది. సినిమాలో 'ప్రేమ, గౌరవం, పాలిటిక్స్' అనే థీమ్స్ ను హైలెట్ చేయనున్నట్లు ఇదివరకే అనౌన్స్ మెంట్ పోస్టర్ తో హింట్ ఇచ్చారు. అధికారం కోసం ఒక సామాన్యుడు చేసే పోరాటం, అందులోని లోతుపాతులను దర్శకుడు తనదైన శైలిలో అగ్రెసివ్‌గా ప్రెజెంట్ చేయనున్నట్లు తెలుస్తోంది. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా క్వాలిటీ విషయంలో ఎక్కడా తగ్గలేదని గ్లింప్స్ చూస్తేనే అర్థమవుతోంది. సందీప్ కిషన్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఈ విజువల్స్ తో సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది.కృష్ణ చైతన్య మార్క్ మాస్ మేకింగ్, సందీప్ కిషన్ పవర్ ఫుల్ పర్ఫార్మెన్స్ తో 'పవర్‌పేట' ఒక క్రేజీ ప్రాజెక్ట్ గా రాబోతున్నట్లు అర్థమవుతుంది.



# మార్ష్ విధ్వంసక సెంచరీ, పంత్ మెరుపులు..

## ఆర్సీబీ ముందు భారీ లక్ష్యం

- లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ల విధ్వంసం
- మిచెల్ మార్ష్ 56 బంతుల్లోనే 111 పరుగులతో అద్భుత సెంచరీ
- చివర్లో 10 బంతుల్లో 32 పరుగులతో మెరిసిన రిషభ్ పంత్
- వర్షం కారణంగా మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదింపు
- డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 213 పరుగుల భారీ లక్ష్యం
- ఛేజింగ్ లో కోహ్లి డకౌట్




కీలక మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్ జీ) బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో (ఆర్సీబీ) జరుగుతున్న మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ (111) అద్భుత సెంచరీతో కదం తొక్కడంతో లక్నో జట్టు భారీ స్కోరు సాధించింది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది.

లక్నోలోని ఏకానా స్టేడియంలో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ నిర్ణయం బెడిసికొట్టింది. ఆది నుంచే దూకుడుగా ఆడిన మిచెల్ మార్ష్, ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 56 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్సర్లతో 111 పరుగులు చేసి లక్నోకు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. మరోవైపు, ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17) నెమ్మదిగా ఆడాడు.

మార్ష్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (38) కూడా తనదైన శైలిలో రాణించాడు. ఇక చివర్లో కెప్టెన్ రిషభ్ పంత్ మెరుపు ఇన్నింగ్స్ తో చెలరేగాడు. కేవలం 10 బంతులు ఎదుర్కొన్న పంత్.. 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో లక్నో స్కోరు 200 పరుగులు దాటింది. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ తలో వికెట్ పడగొట్టారు.

ఆర్సీబీకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ జాకబ్ బెతెల్ (4) మహమ్మద్ షమీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ వెంటనే, ప్రిన్స్ యాదవ్ వేసిన రెండో ఓవర్లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (0) రెండు బంతులు మాత్రమే ఆడి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కోహ్లి డకౌట్‌గా వెనుదిరగడంతో ఆర్సీబీ శిబిరంలో నిరాశ ఆవరించింది.

ప్రస్తుతం క్రీజులో దేవదత్ పడిక్కల్ (0), కెప్టెన్ రజత్ పటీదార్ (1) ఉన్నారు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే మిగిలిన బ్యాటర్లు అసాధారణ రీతిలో రాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

### భువనేశ్వర్ రికార్డు..

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) స్టార్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ లక్నోతో మ్యాచ్ సందర్భంగా ఒక అరుదైన రికార్డు సాధించాడు. లక్నో సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్ భువనేశ్వర్‌కు 200వ మ్యాచ్ కావడం విశేషం. ఐపీఎల్ లో ఈ ఘనత సాధించిన తొలి పేసర్‌గా భువనేశ్వర్ ఈ రికార్డు సాధించాడు.బిఓవరాల్‌గా ఐపీఎల్‌లో 200 మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో భువనేశ్వర్ కుమార్ 12వ స్థానంలో ఉన్నాడు. అయితే 12 మంది భారత ఆటగాళ్లే కావడం ఇక్కడ చెప్పుకోదగ్గ విషయం. ఇక భువనేశ్వర్ కుమార్ ఇప్పటివరకు 199 మ్యాచ్‌ల్లో 215 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్సీబీ తరపున 10 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో లీడింగ్‌లో ఉన్నాడు.బి 2011లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన భువనేశ్వర్ తొలుత పుణే వారియర్స్ (2011-2013 వరకు) 26 మ్యాచ్‌లు, ఎస్‌ఆర్‌హెచ్ (2014-2024 వరకు) 129 మ్యాచ్‌లు, ఆర్సీబీ (2025 నుంచి) 44 మ్యాచ్‌లు ఆడాడు.

# ఫైనల్‌కు భారత మహిళా ఆర్చర్లు

## సెమీస్ లో పటిష్ట కొరియాపై సంచలన విజయం

**షాంఘై(చైనా):** ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2లో భారత మహిళల జట్టు సత్తా చాటింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో 10సార్లు ఒలింపిక్ ఛాంపియన్ కొరియాను ఓడించి తుది పోరుకు అర్హత సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్ లో దీపికా కుమారి, అంకితా భకత్, కుంకుమ్ మొహోద్ లతో కూడిన మహిళలజట్టు సెమీస్ లో కొరియాపై 5-1పాయింట్ల తేడాతో విజయం సాధించింది.

ఆదివారం జరిగే ఫైనల్లో భారతజట్టు స్వర్ణ పతక పోటీకి చైనాతో తలపడనుంది. ఈ టోర్నీలో భారత మహిళలజట్టుకు వరుసగా ఇది మూడో విజయం. తొలిరౌండ్ లో ఉజ్బెకిస్తాన్ పై 6-2(52-26, 57-54, 55-54, 55-51) తేడాతో విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో వియత్నాంపై విజయం సాధించి సెమీస్ కు చేరింది.

ఇక కాంపౌండ్ మిక్స్ డ్ టీం విభాగం రెండోరౌండ్ లో భారతజట్టు 159-150పాయింట్ల తేడాతో విజయం సాధించి క్వార్టర్స్ కు చేరింది. ఫైనల్ కు చేరిన భారతజట్టుకు పతకం ఖాయమైంది. ఇక పురుషుల జట్టు గురువారం జరిగిన తొలిరౌండ్ పోటీలోనే నిష్క్రమించింది. ఉత్కంఠభరితంగా సాగిన తొలిరౌండ్ పోటీలో తరుణ్ దీప్ రాయ్, యశ్ దీప్ భోగే, ధీరజ్ బొమ్మదేవరలతో కూడిన భారతజట్టు బంగ్లాదేశ్ చేతిలో 6-2తో ఓటమిపాలైంది.



# చురుకైన కార్యకర్తల అకాల మరణం కలచివేసింది

**- ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ**
**- సిరసంబేడు సిద్ధార్థ, చావలి రాము మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన నాయకులు**



**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం సిరసంబేడు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త సంచి సిద్ధార్థ, చావలి గ్రామానికి చెందిన గొల్ల రాము అకాల మరణాలు పార్టీ శ్రేణులను తీవ్ర విషాదంలో ముంచేశాయి. ఇద్దరు చురుకైన కార్యకర్తలను కోల్పోవడం పట్ల నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. సాంచి సిద్ధార్థ పిడుగుపాటుకు గురై మృతి చెందగా, గొల్ల రాము ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసి స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. గ్రామాల్లో విషాద ఛాయలు



అలుముకోగా, కుటుంబ సభ్యుల రోదనలు ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. నాయుడుపేట మార్చురీ వద్ద మృతదేహాలను సందర్శించిన నాయకులు, ఇద్దరు కార్యకర్తలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన ఇద్దరు కార్యకర్తలను కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు. "కార్యకర్తల క్షేమమే పార్టీకి ముఖ్యమని, ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని" భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిద్ధార్థ, రాము ఇద్దరూ గ్రామాల్లో అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం కలిగినవారని, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని స్థానికులు గుర్తుచేసుకున్నారు. వారి అకాల మరణం గ్రామాల్లో తీరని విషాదాన్ని మిగిల్చిందన్నారు. చివరిగా, మరణించిన ఇద్దరు కార్యకర్తల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.

# విశ్వకవి రవీంద్ర నాథ్ ఠాగూర్ 165వ జయంతి

## విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు 102వ వర్ధంతి



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పెన్షనర్స్ భవనంలో గురువా రం ఉదయం రవీంద్ర నాథ్ ఠాగూర్ 165వ జయంతి, ,విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 102 వ వర్ధంతి కార్యక్రమము పెన్షనర్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆ ధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మొదట రవీంద్ర నాథ్ ఠాగూర్,అ ల్లూరి సీతారామరాజు చిత్ర పటాల కు కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు సెక్రెటరీ రామ్ మోహన్ చిత్ర పటాల కు పూల మాల వేసి నివాళులర్పిం చారు. అసోసియేట్ ప్రెసిడెంట్ స్వ ర్ణాంబ మాట్లాడుతూ రవీంద్ర నాథ్ ఠాగూర్ భారత దేశానికి జాతీయ గీ తాన్ని అందించిన కవి, రవీంద్ర నాథ్ ఠాగూర్.ఆయన రాసిన జాతీయ గీతం భారత మాత గురించి కాక ఇం గ్లీష్ లో దొరని కీర్తిస్తూ రాశారని అభి ప్రాయం చాల మందిలో ఉంది. అ ల్లూరి సీతారామరాజు స్వతంత్ర స మర యోధుడు.వీరు గుఱ్ఱపు స్వారీ విలువిద్య, సంస్కృతం, ఆయుర్వేదం, జ్యోతిష్యము, వాస్తు శాస్త్రం, కవి త్వంలలో సిద్ధ హస్తులు.గిరిజనుల కు దురాలవాట్లకు దూరం చేసి వా రికి యుద్ధ విద్యలు గెరిల్లా యుద్ధ వి ద్యలు నేర్పి వారికి పోరాటానికి సి ద్ధం చేశారు అని కోశాధికారి జెన్నే కు ల్లాయి బాబు తెలిపారు. ఈ కార్యక్ర మంలో అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, సెక్రెటరీ రామ్ మోహన్,కోశా ధికారి జెన్నే కుల్లాయి బాబు, నారాయణ రెడ్డి, చెన్నారెడ్డి, నారాయణ శెట్టి,శామ్యూల్, దేవదాస్, హస్సన్ అహహ్మద్,మద్దులేటి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యం

**- జూన్‌లోపు తుంగభద్ర ఎగువకాలువ మరమ్మతులు పూర్తి**
**- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**కణేకల్ - సూర్య వాస్తవం :** తుంగభద్ర ఎగువకాలువ పరిధిలో చేపట్టిన శాశ్వత, తాత్కాలిక మరమ్మతు పనులను జూన్ నెలాఖరులోపు పూర్తి చేస్తామని రాయదుర్గం ఎమ్మెల్యే తెలిపారు. గురువారం సాయంత్రం కణేకల్లు సమీపంలోని చెరువు వద్ద కొనసాగుతున్న అవుట్ ఫాల్ రెగ్యులేటర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అనంతపురం జిల్లాకు జీవనాడిగా భావించే తుంగభద్ర ఎగువకాలువ ఆధునీకరణ పనుల కోసం గత ఏడాది రూ.33 కోట్ల నిధులు మంజూరైనట్లు గుర్తు చేశారు.గత ఏడాది యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి అధిక భాగాన్ని పూర్తి చేశామని, మిగిలిన రూ.7.50 కోట్ల పనులతో పాటు ఈ ఏడాది మరో రూ.2.40 కోట్ల పనులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం కాలువ 145వ కిలోమీటర్ వద్ద అవుట్ ఫాల్ రెగ్యులేటర్ నిర్మాణంతో



పాటు ఇతర మరమ్మతు పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జూన్ నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తి అయితే రైతులకు మరింత సమర్థవంతంగా సాగునీరు అందించడంతో పాటు కాలువ ద్వారా అధిక పరిమాణంలో నీటిని తరలించే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పనులను నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సకాలంలో నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కు, అలాగే సహకరించిన మంత్రులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనేకల్ మండల కన్వీనర్ వన్నారెడ్డి , హెచ్ ఎల్ సి అధికారులు, చెరువు సంఘం అధ్యక్షుడు బిటి రమేష్ ,లాలెప్ప ,ఎడిసిసి బ్యాంక్ అధ్యక్షుడు నాగార్జున ,సుదర్శన్ , బసవరాజు, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# "ఒక నెల-ఒక గ్రామం ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు"

**- గ్రామానికే రెవెన్యూ సేవలు**
**- ప్రజా సమస్యలపై అధికారుల దృష్టి**
**- పుడేరు గ్రామ సభలో 13 వినతులు స్వీకరణ**
**- రెవెన్యూ సమస్యలకే అధిక ప్రాధాన్యం**



**నాయుడుపేట-సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఒక నెల--ఒక గ్రామం--నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా గురువారం సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేట మండలం పుడేరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వేగవంతమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రామ సభకు నాయుడుపేట తహసీల్దార్ యువరాజ్ హాజరై గ్రామ ప్రజల నుంచి వివిధ శాఖలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. మొత్తం 13 దరఖాస్తులు పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన 10 వినతులు నమోదయ్యాయి. వీటిలో 9 సర్వే సమస్యలు, ఒకటి మ్యుటేషన్‌కు సంబంధించినదిగా అధికారులు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖకు ఒక వినతి పెన్షన్ అంశంపై అందగా, ఇరిగేషన్ శాఖకు సంబంధించిన రెండు వినతులు సాగునీటి చెరువుల సమస్యలపై వచ్చినట్లు వివరించారు. సభలో అందిన ప్రతి దరఖాస్తును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్జీదారులకు రసీదులు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ ప్రజలకు రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచి, వాటికి సంబంధించిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ప్రజా సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ యువరాజ్ తెలిపారు. గ్రామ సభలో పాల్గొన్న గ్రామస్థులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి అవకాశం కల్పించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. "ఒక నెల--ఒక గ్రామం" కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# దేవాలయంలో చోరీ కేసును ఛేదించిన ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు

**- ఇద్దరు దొంగల అరెస్టు,**
**- గణపతి విగ్రహం, రూ.1,500 హుండీ నగదు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం**

**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** ప్రొద్దుటూరులోని ఇందిరా కాలనీలో ఉన్న సీతారాముని దేవాలయంలో గత నెల 30 వతేది రాత్రి జరిగిన చోరీ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, ఈ కేసు దర్యాప్తు నిమిత్తం ప్రొద్దుటూరు ఎఎస్పీ విభూ కృష్ణ ఆధ్వర్యంలో, ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్ సి.ఐ ఎం. నాగ భూషణ్ పర్యవేక్షణలో ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అనుమానితులైన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు సదరు దేవాలయంలో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ముద్దాయిలు దేవాలయ తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి అల్యూమినియంతో తయారు చేసిన గణపతి విగ్రహాన్ని అపహరించి, దానిని పగులగొట్టి




అందులో ఉన్న సుమారు రూ.1,500 హుండీ నగదు, పూజా సామాగ్రి మరియు ఇతర వస్తువులను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైనదని పేర్కొన్నారు. అరెస్టు చేసిన ముద్దాయిలు ప్రొద్దుటూరు టౌన్. సుదారాచార్యుల వీధికి చెందిన పిట్టా చంద్రబాబు తనయుడు పిట్టా బాలాజీ ఎ1 కాగా అమృత నగర్ కు చెందిన నూర్ మొహమ్మద్ కుమారుడు షేక్ ఇబ్రహీం కలియుల్లా ఎ2 అని తెలిపారు. ముద్దాయిలను పూర్తిస్థాయిలో విచారించగా, వారు ఇటీవల చోరీ కాబడిన మరో రెండు మోటార్ సైకిళ్ల చోరీ కేసుల్లో కూడా ప్రమేయం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వారి వద్ద నుండి చోరీ అయిన రెండు మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు.

**నిందితుల నేర చరిత్ర:**

ఎ-1 పిట్టా బాలాజీ గతంలో మొత్తం 08 చోరీ కేసుల్లో మరియు ఎ-2 షేక్ ఇబ్రహీం కలియుల్లా మొత్తం 03 చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్న నేరస్థులుగా గుర్తించినట్లు తెలిపారు. ఇరువురు 20 ఏళ్ళ వయసు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఇద్దరు ముద్దాయిలు ప్రమేయం ఉన్న అన్ని కేసులు చోరీ కేసులేనని వెల్లడించారు. పై నేరాలకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతోందని, ఇద్దరు ముద్దాయిలను గురువారం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచగా కోర్టు వారికి 15 రోజుల రిమాండ్ విధించినట్లు సి.ఐ ఎం. నాగ భూషణ్ తెలిపారు. ఈ మూడు కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ప్రొద్దటూర్ రూరల్ సిఐ యం.నాగ భూషణ్ మరియు ఎస్సైలు కె.సి.రాజు, శ్రీకాంత్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ దాస్, కానిస్టేబుల్ సునీల్ తదితర సిబ్బందిని ప్రొద్దుటూరు ఎఎస్పీ విభూ క్రిష్ణ అభినందించారు.

# వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు



**నంబుల పూలకుంట-సూర్య వాస్తవం :** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా యంత్ర పరికరాలు అయినటువంటి ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయర్లు, నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్, మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్ మొదలగు పరికరాలపై రాయితీలతో అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి .లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల రైతులు మే 6వ తేదీ నుండి మే 19 వరకు ఆన్లైన్ ద్వారా దగ్గరలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. ఈ పథకం కింద ఎ, ఎ, చిన్న కారు, సన్న కారు మహిళా రైతులకు 50% రాయితీ, ఇతర రైతులకు 40 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించినన్నట్లు తెలిపారు. రైతులను లాటరీ పద్ధతి ద్వారా జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఎంపిక చేయడం జరుగుతుందని వారు తెలిపారు. కావున మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )